V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
03-02-2025

సంపుటి : 01 | సంచిక : 272 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD




కేంద్రంపై యుద్ధం ప్రకటించి

# రాష్ట్రానికి నిధులు సాధించాలి

- నిధుల కేటాయింపుల్లో తెలంగాణకు ఏటా అన్యాయం జరుగుతోంది
- జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే చూపింది
- దేశాభివృద్ధికి తెలంగాణ ఎంతో సహాయ పడుతుంది కేంద్రం మాత్రం రాష్ట్రం పట్ల వివక్ష చూపింది
- వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుమార్లు నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదు
- ఈ వివక్షను ప్రజా క్షేత్రంలోనే ఎండగట్టాలి
- అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి
- ఈ పోరాటానికి బీఆర్ఎస్ కలిసి రావాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్
- ట్యాంక్ బండ్‌పై కాంగ్రెస్ పార్టీ నిరసన

**కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

**విశ్వంభర, హైదరాబాద్‌:**

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నిరసనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలని ఆయన వెల్లడించారు. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, కేంద్రంపై పోరాటానికి **మిగతా2లో...**

# జనగణన ఇంకెప్పుడు చేస్తారు?

- జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుంది..?
- దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుంది?
- సమ్మిళిత అభివృద్ధికి జనగణన తప్పనిసరి
- కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్:** జనగణనపై కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. జనగణన ఇంకెప్పుడు చేస్తారు..? అని ఆమె ప్రశ్నించారు. సమ్మిళిత అభివృద్ధికి జనగణన తప్పనిసరిగా అవసరమని కవిత అన్నారు.జనగణనను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని కవిత మండిపడ్డారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుంది..? అని ప్రశ్నించారు. జనాభా లెక్కలు లేమితో వృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. జనాభా లెక్కలు లేకుండా దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుంది..? అని అడిగారు. ప్రగతిశీల **మిగతా2లో...**




# రేపు తెలంగాణ అసెంబ్లీ

## సభ ముందుకు కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలు

### శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ప్రకటన జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఫిబ్రవరి 4న తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈమేరకు శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ప్రకటన జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు .. ఉదయం 10గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో.. బీసీ సబ్ కమిటీ కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను క్యాబినెట్‌కు అందజేస్తారు. కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుంది. క్యాబినెట్ సమావేశం అనంతరం 11 గంటలకు అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. శాసనమండలి, శాసనసభలో ఈ రెండు నివేదికలను ప్రవేశ పెట్టి చర్చిస్తారు.

# కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది

- వసంత పంచమి వేళ మరింత రద్దీ!
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బంది ఏర్పాట్లు
- సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం



2



త్వరలోనే పంచాయితీ,

# మున్సిపల్ ఎన్నికలు

- ఈనెల 15లోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్
- అంతా సిద్ధంగా ఉండాలి
- కీలక ప్రకటన చేసిన పొంగులేటి

2

# బీసీలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ ఆకాంక్ష

**బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టాం**

- కులగణన, సామాజిక సర్వేలో 3.50 కోట్ల మంది వివరాలిచ్చారు
- సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు
- ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాం
- కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందజేశారు. కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామన్నారు. ''స్వాతంత్ర్య పూర్వం నుంచి మనదేశంలో **మిగతా2లో...**

# ఇది భారత దేశ బడ్జెట్

**తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదు**

- 95% పథకాల్లో తెలంగాణకు లబ్ధి చేకూరుతోంది
- ఎంఎస్ఎంఈలు, చిన్న పరిశ్రమలకు ఆపన్నహస్తం
- రూ.10 వేల కోట్లతో ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఏర్పాటు వల్ల తెలంగాణ స్టార్టప్ లకు ఎంతో లబ్ధి చేకూరుతుంది
- బడ్జెట్‌పై వచ్చిన విమర్శలకు స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** భారత పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ . దాదాపు 50 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్‌లో తెలంగాణ కు ఎటువంటి నిధులు కేటాయించ లేదని రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తరపున నిరసన చేపట్టారు. కాగా తెలంగాణ రాజకీయ నేతలు బడ్జెట్ పై చేస్తున్న ఆరోపణలు, విమర్శలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి **మిగతా2లో...**

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

**నేటి చికెన్ ధరలు**

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 103 | ₹ 125 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 181 | ₹ 206 |

అంతేగా!



# గొంగడి త్రిషకు అభినందనల వెల్లువ

- క్రీడాకారులు తెలంగాణకు గర్వ కారణం: సీఎం రేవంత్‌రెడ్డి
- ఇది చారిత్రాత్మక విజయం.. గొంగడి త్రిషకు ప్రత్యేక అభినందనలు: కేటీఆర్




2



# మూసీ నిర్వాసితులకు ఆర్థిక సాయం

**మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పోరేషన్‌కు పురపాలక శాఖ రూ.37కోట్ల 50లక్షలు నిధులువిడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ**

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అమలులో భాగంగా మూసీ **మిగతా2లో...**

# అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసుకెళ్తాం

- వైద్య ఖర్చులు భరిస్తాం
- కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత బన్నీ వాసు



**విశ్వంభర, హైదరాబాద్:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. రెండు నెలలుగా సికింద్రాబాద్ కిమ్స్ **మిగతా2లో...**

## జనగణన ఇంకెప్పుడు చేస్తారు..?

**మొదటిపేజీ తరువాయి**
విధానాలకు జనాభా లెక్కలు తప్పనిసరి ఆమె పేర్కొన్నారు. జనగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

**కవితతో బీసీ సంఘాల భేటీ..**
కేబినెట్ సబ్ కమిటీకి ప్లానింగ్ శాఖ సర్వే నివేదిక అందించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత నివాసంలో బీసీ సంఘాలు, తెలంగాణ జాగృతి నేతలు భేటీ అయ్యారు. తదుపరి వ్యూహంపై ఎమ్మెల్సీ కవితతో బీసీ సంఘాల నేతలు చర్చించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించిన సర్వే గణాంకాల ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లపై కవిత తో కలిసి అధ్యయనం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ ఎంత మేరకు పెరుగుతుంది అనే అంశంపై చర్చించారు.

## కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది..

**ప్రయాగ్‌రాజ్:** మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది. జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోడీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఇది భారత దేశ బడ్జెట్


**మొదటిపేజీ తరువాయి**
స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది భారత దేశ బడ్జెట్ అని.. ఇది తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదని చెప్పుకొచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని పథకాల్లో 95% పథకాల్లో తెలంగాణకు లబ్ధి చేకూరుతోందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. అలాగే 2025 బడ్జెట్లో ఎంఎస్ఎంఈలు, చిన్న పరిశ్రమలకు ఆపన్నహస్తాన్ని అందించాయని ఆయన అన్నారు. అలాగే తెలంగాణలో 10 లక్షలకు పైగా రిజిస్టర్ అయిన ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్ తో ప్రయోజనం చేకూర్చుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే స్టార్టప్‌లకు రూ.10 వేల కోట్లతో ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఏర్పాటు వల్ల తెలంగాణ స్టార్టప్ లకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అన్నారు. కేంద్రంలో తెలంగాణ పన్ను వాటా రూ.27 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు పెరిగినట్లు కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏ పథకం తీసుకొచ్చినా.. దాని లబ్ధి తెలంగాణ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి ఖచ్చితంగా దక్కుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా శనివారం లోక్ సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ 12 లక్షల వరకు ఇన్ కమ్ ట్యాక్స్ రద్దు చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో దేశంలో ఉన్న పేద, మధ్యతరగతి ఉద్యోగులకు భారీ ఉపశమనం కలిగించనుంది. దీంతో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారు.

## త్వరలోనే పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు

**విశ్వంభర, ఖమ్మం:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక అప్డేట్ వెలువరించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అతి త్వరలోనే పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి.. అంతా సిద్ధంగా ఉండాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈనెల 15లోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. ఇదిరమ్మ ఇళ్ళులబ్దిదారులు అందరికీ ఇస్తామని మంత్రి తెలిపారు. అలాగే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులకు అందజేస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డులు పంచాయితీ ఎన్నికల లోపు అర్హత కలిగిన కుటుంబాలకు ఇస్తామని పేర్కొన్నారు. విపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, క్షేత్రస్థాయిలోకి వెళ్ళి ఎంక్వైరీ చేసుకోవాలని సూచించారు. కాగా తెలంగాణలో కులగణన సర్వే, రిజర్వేషన్ల అంశంపై కీలక అడుగులు పడుతున్నాయి. నేడు కులగణనపై కమిషన్.. కేబినెట్ సబ్ కమిటీకి తన నివేదిక అందజేసింది. దానిని త్వరలో సిఎం రేవంత్ రెడ్డికి అందజేసి.. ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే రిజర్వేషన్ల అంశం కూడా మరి కొద్దిరోజుల్లోనే కొలిక్కి రానుంది. రిజర్వేషన్ల వర్గీకరణ అంశం పూర్తయిన తర్వాత ఏ క్షణాన అయినా స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మంత్రి పొంగులేటి వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నెల 15 లోపు రిజర్వేషన్ల వర్గీకరణ అంశం పూర్తి కానున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే రాష్ట్రంలో మరో ఎన్నికల సమరానికి సిద్ధం కానున్నాయి కీలక పార్టీలు. అయితే తాము పాలనలోకి వచ్చిన ఏడాదిలోనే సాధించిన విజయాలు, చేసిన అభివృద్ధి పనులతో ప్రజల్లోకి వెళ్లాలని, అధికార కాంగ్రెస్ పార్టీ చూస్తుంటే.. ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేర్చని ఎన్నికల హామీల అంశాలను ప్రజల్లోకి తీసుకు పోయి ఓట్లు సాధించాలని ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చూస్తున్నాయి.

## అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసుకెళ్తాం

**మొదటిపేజీ తరువాయి**



ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్స గురించి బన్నీ వాసు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసుకెళ్తామని చెప్పారు. శ్రీతేజ్ వైద్య ఖర్చులు భరిస్తామని తెలిపారు.తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్ దాదాపు రెండు నెలలుగా ఆసుపత్రికే పరిమితమయ్యాడు. అయినా బాలుడి ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. తొక్కిసలాట తర్వాత బాలుడిని పక్కకు తీసుకెళ్లిన పోలీసులు సీపీఆర్ చేశారు. వెంటనే సికింద్రాబాద్ కిమ్స్‌కు తరలించారు. కొన్ని రోజులపాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సొంతంగా ఆక్సిజన్ పీల్చుకోవడంతో వెంటిలేటర్‌ను తొలగించి ప్రత్యేక గదికి మార్చారు. అప్పటి నుంచి అతను ఆసుపత్రిలో మంచానికే పరిమితమయ్యాడు. పేరుపెట్టి పిలిచినా కళ్లు తెరిచి చూడలేదు. నోరు విప్పి మాట్లాడలేదు. ఇప్పటివరకు ముక్కు వద్ద అమర్చిన సన్నని గొట్టం ద్వారానే లిక్విడ్ ఆహారం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ చేపడుతున్నారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. ఎప్పుడు కోలుకుంటాడో వైద్యులు కూడా చెప్పలేని పరిస్థితి. శరీరంలో ఇతర జీవ ప్రక్రియలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ శ్రీతేజ్ నుంచి స్థిరమైన ప్రతిస్పందనలు ఉండటం లేదని వైద్యులు చెబుతున్నారు.

# గొంగిడి త్రిషకు అభినందనల వెల్లువ



**విశ్వంభర, హైదరాబాద్:** పురుషులకు కూడా సాధ్యం కాని విధంగా అండర్ 19 భారత మహిళల క్రికెట్ జట్టు వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెల్చుకుంది. ఈ రెండు విజయాల్లోనూ తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష కీలక పాత్ర పోషించింది. 2023లో జరిగిన అండర్ 19మహిళల టీ20 ప్రపంచకప్ లో నిలకడగా ఆడిన త్రిష గొంగడి ఈసారి కూడా మెరుపులు మెరిపించింది.ఈనేపథ్యంలో త్రిషకు అభినందనలు వెల్లువెత్తాయి వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు సీఎం.. ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
మలేషియాలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా జట్టు విశ్వవిజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అద్భుత ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వకారణమని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

**ఇది చారిత్రాత్మక విజయం.. గొంగడి త్రిషకు ప్రత్యేక అభినందనలు : కేటీఆర్**
టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించిన టీమిండియా అండర్-19 వుమెన్స్ జట్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఇది చారిత్రాత్మక విజయం అని కొనియాడారు. భారత్‌కు చెందిన అండర్-19 వుమెన్స్ జట్టు.. టీ20 వరల్డ్ కప్‌ను కైవసం చేసుకోవడం మనల్ని గర్వపడేలా చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు.టీమిండియా వుమెన్స్ జట్టుకు భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించిందని ప్రశంసించారు. టీమిండియా గెలుపునకు ఎంతో సహకారం అందించిన త్రిషకు ప్రత్యేక అభినందనలు చెప్పారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను గెలుచుకున్న త్రిష మ్యాచ్‌ను ముందుండి నడిపించి విజయ తీరాలకు చేర్చారని కేటీఆర్ ప్రశంసించారు.

**యువ బ్యాటర్ గొంగడి త్రిషకు ప్రత్యేక అభినందనలు : హరీశ్‌రావు**
అండర్ -19 టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన టీమిండియా జట్టుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం భారతదేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ గెలుపు ప్రతిభ, కృషి, దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తుందన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ గొంగడి త్రిష.. ఈ టోర్నీలో 300 కంటే ఎక్కువ పరుగులు చేయడమే కాకుండా 10 వికెట్లు తీసి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిందన్నారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు. గొంగడి త్రిష భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**అండర్ -19 వుమెన్స్ జట్టుకు ఎమ్మెల్సీ కవిత అభినందనలు..**
టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా అండర్-19 వుమెన్స్ జట్టుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ముద్దుబిడ్డ గొంగడి త్రిషపై ప్రత్యేక ప్రశంసల జల్లు కురిపించారు కవిత. ఫైనల్ మ్యాచ్‌లోనూ ఆమె అద్భుతంగా రాణించారని ప్రశంసించారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన త్రిషను ప్రత్యేకంగా కవిత అభినందించారు. దేశానికి, తెలంగాణకు ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. మరోసారి టీ20 వరల్డ్ కప్‌ను తీసుకొచ్చినందుకు వుమెన్స్ జట్టుకు ధన్యవాదాలు తెలిపారు కవిత. కాగా..వుమెన్స్ అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమిండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష 33 బంతుల్లో 44 పరుగులు (8×4) చేసి నాటౌట్‌గా నిలిచింది.అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభనతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్. నలుగురు ప్లేయర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. భారత జట్టు బౌలర్లలో త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ తీశారు.

# బీసీలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ ఆకాంక్ష

**మొదటిపేజీ తరువాయి**
జనగణన జరుగుతోంది. అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించింది. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టాం. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగింది. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాం. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతాం. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది'' అని మంత్రి ఉత్తమ్ వివరించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు...**

- తెలంగాణలోని 3,54,77,554 మంది వివరాల నమోదు.
- మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు
- కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం
- సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం
- కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల జనాభా 17.43 శాతం
- ఎస్టీల జనాభా 10.45 శాతం
- రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం
- ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08
- ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం
- ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం
- రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
- రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం


## మూసీ నిర్వాసితులకు ఆర్థిక సాయం

**మొదటిపేజీ తరువాయి**
నిర్వాసితులకు ఆర్థిక సాయంఅందించేందుకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు పురపాలక శాఖ రూ.37కోట్ల 50లక్షలు నిధులువిడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నుంచి ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్న వారికి ఖర్చుల కోసం రూ.25 వేలు ఇవ్వడం కొనసాగుతోంది. అలా 15 వేల కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు అందజేస్తోంది. మూసీ నిర్వాసితులు ఇండ్లు ఖాళీ చేసే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు పనులకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే కొంతమంది ఇళ్లు ఖాళీ చేసిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించింది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 16వేల ఇళ్లను మూసీ నిర్వాసితులకు ఇచ్చేలా గతంలో జీవో జారీచేసినట్లు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ వెల్లడించారు. 'కొన్నినెలలుగా 3 జిల్లాల పరిధిలోని మూసీ నదిపై సర్వే జరిగింది. రెవెన్యూ అధికారులు నదిగర్భంలో, బఫర్ జోన్ లో 10,200 నిర్మాణాలను గుర్తించారు. వాటిలో ఎవరెవరు ఉన్నారో గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించామని దాన కిశోర్ తెలిపారు. బాధితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తున్నామనే వివరాలు కూడా ఇస్తామని.. మొదట నదీ గర్భంలో ఉన్న 1,600 నిర్మాణాల్లోని బాధితులకు ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. పునరావాసం కల్పించాక ఆక్రమణలను తొలగిస్తామని.. అర్హులైన ప్రతి ఒక్క బాధితుడికి చట్ట ప్రకారం నష్టపరిహారం, పునరావాసం అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. మూసీ నిర్వాసితుల కోసం తాజాగా విడుదలైన 37.50కోట్లతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులు ఊపందుకోనున్నాయి.

## బీజేపీ గెలుపు.. ఢిల్లీకి మలుపు

**బండి సంజయ్**

**ఢిల్లీ:** అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీ ని కూకటి వేళ్లతో పెకిలించి వేయాల్సిన సమయం వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో రూ.28 వేల400 కోట్ల జల్ బోర్డ్ కుంభకోణం, రూ.4,500 కోట్ల బస్సుల కొనుగోలు కుంభకోణం, బస్సుల్లో సదుపాయాల పేరుతో రూ.500 కోట్ల దుర్వినియోగం, నకిలీ హెల్త్ టెస్టుల ద్వారా కోట్ల రూపాయల అక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈరోజు ఆదివారం బీజేపీ తెలంగాణ కోశాధికారి భండారి శాంతికుమార్, పార్టీ ఢిల్లీ ప్రతినిధి నూనె బాలరాజుతో కలిసి ఈస్ట్ ఢిల్లీ, షాద్రా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో బనియా, బ్రాహ్మణ, వాల్మీకీ సామాజికవర్గ ప్రజలు అధికంగా నివాసముండే ప్రాంతాల్లో బండి సంజయ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బీజేపీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు.
ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... ఆడంబరాలకు, అవినీతికి దూరంగా ఉంటూ



పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వచ్చిన ఆప్ నేతలు విలాసవంతమైన జీవితాలను గడుపుతూ ప్రజా ధనాన్ని దోచుకుతిన్నారని మండిపడ్డారు. ప్రజలను మాత్రం బిచ్చగాళ్లలో మార్చారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సాదాసాదీ జీవితం గడిపిన ఆప్ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం స్కాం తెలంగాణకు విస్తరించిందని, ఈ స్కాం ఢిల్లీ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు. ఈ కుంభకోణంలో ప్రధాన ముద్దాయిలుగా కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ నేత కవిత ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అవినీతి కేసుతో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ కోర్టు ఒత్తిడి చేస్తే బలవంతంగా రాజీనామా చేయకపోవడం ఆయన స్వార్థపూరిత రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తుందని మండిపడ్డారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతల అబద్ధపు, మోసపూరిత రాజకీయాలతో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారన్నారు. మార్పు కోసం, ఢిల్లీ అభివృద్ధి కోసం బీజేపీవైపు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బంపర్ మెజారిటీతో గెలిచి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఢిల్లీ ప్రగతికి మలుపు అని బండి సంజయ్ చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 'మహిళా సమృద్ధి యోజన' పథకం కింద అర్హులైన పేద మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ.500 లకే ఉచిత గ్యాస్ సిలిండర్, ముఖ్యమంత్రి మాతృత్వ భద్రతా పథకం కింద గర్భిణీ స్త్రీలకు రూ. 21,000తోపాటు 6 పోషకాహార కిట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తామని, దీని ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. దీంతోపాటు బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామని చెప్పారు.

## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి

**మొదటిపేజీ తరువాయి**
బీఆర్ఎస్ కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు.దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయ పడుతుంటే.. కేంద్రం మాత్రం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ప్రజా క్షేత్రంలోనే ఎండగట్టాలని అన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుమార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చిన పట్టించుకోలేదని మండిపడ్డారు. '' నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే చూపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.


## ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తాం: సీతక్క

- ఘనంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం
- కేక్ కట్‌చేసిన మంత్రి సీతక్క



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నివాసంలో కేక్ కట్‌చేశారు. ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ సంఘం పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సన్మానించారు. ఉపాధి హామీ చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలను ఒకటి తర్వాత ఒకటి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఆర్ డీఎస్ బోర్డు లో జరిగిన అంశాలను, నాన్ ఫైనాన్షియల్ ఇష్యులను త్వరగా క్లియర్ చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి రాష్ట్ర జేఏసీ సంఘం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎలబద్రి లింగయ్య, కో చైర్మన్లు అంజిరెడ్డి, మురహరి విజయ్ కుమార్, వెంకటరామిరెడ్డి, మోహన్ రావు, తంగెళ్ళ రఘు, రామక్రిష్ణ, గురు చరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


## ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జేఈఈ మెయిన్ -2 పరీక్షలు




**విశ్వంభర, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా గల ఐఐటీలు, ఎన్ఐటీల్లో బీటెక్/ బీఈ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ -2 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ప్రకటించింది. ఈ పరీక్షకు హాజరయ్యేవారు ఈ నెల 25 రాత్రి 9 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఏ వెల్లడించింది. ఇక రాత్రి 11.50 గంటల వరకు ఫీజును స్వీకరిస్తామని సంస్థ ప్రకటించింది. జేఈఈ మెయిన్ -1 పరీక్షలను జనవరిలో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుండగా, మెయిన్ -2 పరీక్ష షెడ్యూల్‌ను ఎన్టీఏ తెలిపింది. జేఈఈ మెయిన్ -2కు ఎప్‌సెట్ పరీక్షకు మధ్య వ్యవధి 20 రోజులే ఉండనుంది. ఈ ఏడాది ఎప్‌సెట్‌ను ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు నిర్వహించనున్న విషయం తెలిసిందే. జేఈఈ పరీక్షలు ముగిసిన తర్వాత ఎప్‌సెట్ పరీక్షలు జరగనుండగా విద్యార్థుల మధ్య ఒత్తిడి తగ్గే అవకాశాలున్నట్లు నిపుణులు అంచనాలేస్తున్నారు.

## ఘనంగా V3 న్యూస్ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరణ

### ఆవిష్కరించిన సీఎండీ డా. కాచం సత్యనారాయణ




**విశ్వంభర, హైదరాబాద్ :** 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రిక, ఛానెల్ క్యాలెండర్ సంస్థ చైర్మన్ డా. కాచం సత్యనారాయణ చేతులమీదుగా చైతన్యపురిలోని ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. గత 7 సంవత్సరాలుగా ప్రజాపక్షాన పోరాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వ్యవహరిస్తూ, నిష్పక్షపాత ధోరణితో ముందుకు దూసుకుపోతున్నదని. వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు, వీక్షకులకు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కాసం ఏకసాయి, హెచ్ ఆర్ సంగసారి రమేష్, సీనియర్ సబ్ ఎడిటర్ సోమపంగు వెంకటేశ్వర్లు, మేడికొండ పరమేష్, రిపోర్టర్లు గోవింద్ ప్రసాద్, పూర్ణ చందర్, సాయి గౌడ్, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డా. యర్రమాద కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి డా. కొడుమూరి దయాకర్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాము మహేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కులగణన పూర్తి చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

### - మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం లో.. ప్లానింగ్ కమిషన్ అధికారులు రాష్ట్రంలో నిర్వహించిన కులగణన నివేదిక ను ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కులగణన పూర్తి చేసినందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తాము రాష్ట్రంలో కులగణన ప్రారంభించిన సమయంలో అనేక అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అలాగే ఈ కులగణన ప్రక్రియ సక్రమంగా జరగకుండా అపోహలు సృష్టించారని.. అయినప్పటికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు, ప్రజలు ఈ సర్వేకు సంపూర్ణంగా సహకారం అందించిన కులగణన విజయవంతం చేశారని చెప్పుకొచ్చారు. అలాగే ఈ సర్వేను నిర్వహించేందుకు బీసీ కమిషన్ వద్ద సరైన యంత్రాంగం లేకపోవడం వల్లనే.. ప్లానింగ్ కమిషన్కు బాధ్యతలు అప్పగించామని.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్లనే సర్వే విజయవంతం అయిందని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. అలాగే ఈ కులగణన సర్వేలో పాల్గొన్న అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉంటే ఈ రోజు ప్లానింగ్ కమిషన్ ఇచ్చిన నివేదిక లో.. కులగణన సర్వేలో మొత్తం 3,889 మంది అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే మొత్తం 96.9 శాతం కుటుంబాలను అధికారులు సర్వే చేశారని. ఈ సర్వేలో తెలంగాణలోని మొత్తం 3 కోట్ల 54 లక్షల మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 3.1 శాతం మంది ప్రజలు ఈ సర్వేలో పాల్గొనలేదని.. కమిషన్ తన నివేదికలో తెలిపింది. కాగా ఈ కులగణన నివేదికపై సోమవారం కేబినెట్ సబ్ కమిటీలో చర్చించిన అనంతరం దానికి ఆమోదం తెలపనుంది. అనంతరం నివేదికను రెడీ చేసి ఈ నెల 5న ఉదయం జరగనున్న కేబినెట్ సమావేశంలో ప్రవేశపెడతారు. అక్కడ ఆమోదించిన తర్వాత అదే రోజు మధ్యాహ్నం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ కులగణన నివేదికను ప్రవేశపెట్టనున్నారు.



సాగర్ రోడ్డు మన్నెగూడలోని వేద కన్వెషన్‌లో మందాడి మంజుల, మందాడి సుధీర్‌రెడ్డి దంపతుల కూతురు హరిణి రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణ, దీము మహేందర్ యాదవ్, కృష్ణారెడ్డి, సుధాకర్

- విశ్వంభర, ఇబ్రహీంపట్నం

# రేవంత్ రెడ్డి పాలనలో మైనార్టీలకు తీవ్ర అన్యాయం

### - ఎమ్మెల్సీ మహమూద్ అలీ



**విశ్వంభర, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మహమూద్ అలీ మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చింది. కానీ ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదు. మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించి మర్చిపోయారు. మైనార్టీల ఓట్లు వేసుకోని మోసం చేశారు. కేసీఆర్ మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేశారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ మైనారిటీలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని ఇవ్వడం లేదు. మైనారిటీ విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో ప్రోత్సాహకాలు ఇస్తామని అమలు చేయడం లేదు. గతంలో కాంగ్రెస్,టీడీపీ రాష్ట్రాన్ని పాలించినా కేసీఆర్ సీఎం అయ్యాకమైనారిటీలకు మేలు జరిగింది. కేసీఆర్ గంగా, జమునా తెహజీబ్‌లా పరిపాలన చేశారని మహమూద్ అలీ గుర్తు చేశారు. కేసీఆర్ మైనారిటీలకు సబ్సిడీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క రూపాయి మైనారిటీలకు సబ్సిడీ ఇవ్వలేదు. ఉర్దూ డీఎస్సీనిర్వహించడం లేదు. కేసీఆర్ ఉర్దూను తెలంగాణ రెండవ అధికార భాషగా ప్రకటించారు. సెట్విన్ ద్వారా ముస్లింలకు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేవారు. కేసీఆర్ హయాంలో పాతబస్తీ అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముస్లిం, మైనారిటీలపై దాడులు పెరిగాయి. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, ప్రజలు పరేషాన్‌లో ఉన్నారు. కేసీఆర్ సెక్యూలర్ లీడర్. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీనా లేదా అనేది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చెప్పాలి. రేవంత్ రెడ్డి పాలనలాగా లేదు మోదీ పాలనలా ఉంది. రేవంత్ రెడ్డి మోదీని బడే భాయ్ అన్నారు. రేవంత్ రెడ్డి మోడీ,అమిత్ షా ను ఫాలో అవుతున్నారు అని ఎమ్మెల్సీ మహమూద్ అలీ ధ్వజమెత్తారు.

# ఢిల్లీ సాహిత్య కార్యక్రమాలకు నల్లగొండ కవులకు ఆహ్వానం



**విశ్వంభర, నల్లగొండ :** ఢిల్లీకి చెందిన సాహిత్య సంస్థ ఆది లీలా ఫౌండేషన్, తెలుగు సాహితీ కళా పీఠం, అనంత సాహిత్య సంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈనెల 8, 9 తేదీలలో ఢిల్లీ తెలంగాణ భవన్లో నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమాలకు నల్గొండ జిల్లా నుండి ఇద్దరు కవులకు ఆహ్వానం అందింది. కవి సమ్మేళనంలో పాల్గొనడానికి నకిరేకల్ కు చెందిన ప్రముఖ కవి తుల శ్రీనివాస్, అష్టావధానంలో పృచ్ఛకుడిగా పాల్గొనడానికి చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన డాక్టర్ సాగర్ల సత్తయ్య లను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వెళ్తున్న శ్రీనివాస్, సత్తయ్యలను సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్, సాహితి మిత్ర మండలి అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, సిలువేరు సాహితీ కళా పీఠం అధ్యక్షులు సిలువేరు లింగమూర్తి, కనకటి రామకృష్ణ, శీలం భద్రయ్య తదితరులు అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ కృషి చేయాలి : జయరాజ్




**విశ్వంభర, ధర్మారం:** లయన్స్ క్లబ్ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం కోసం సమిష్టిగా కృషి చేయాలని ప్రముఖ కవి, కళాకారుడు జయరాజ్పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ తన్నీరు రాజేందర్, క్లబ్ మహిళా ప్రధాన కార్యదర్శి తన్నీరు పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజినల్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ప్రజా సేవలో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది అని అన్నారు.ఈ క్లబ్ ద్వారా పేద ప్రజానీకానికి ఎంతో సేవలు చేయడంతో పాటు ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సహకారాన్ని అందించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం అభినందనీయ మన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవలు చేస్తూ మంచి గుర్తింపు పొందిన రీజినల్ చైర్మన్ రాజేందర్ ను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో రీజినల్ పరిధిలో రానున్న కాలంలో పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.ప్లాస్టిక్ ప్రపంచానికి పెనుభూతంగా మారిందని, అందరూ అప్రమత్తంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని విషయాన్ని అందరూ గ్రహించాలఅన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధానికి పాటుపడదామని క్లబ్ సభ్యులచే ప్రమాణం చేయించారు. ఆర్సీ చైర్మన్ రాజేందర్ జయరాజును ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

# నేటితో ఢిల్లీ ఎన్నికల ప్రచారం బంద్



**ఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ పోరు చివరి అంకానికి చేరుకుంది. దేశ ప్రజలందరినీ తన వైపు తిప్పుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార పర్వం సోమవారం సాయంత్రానికి ముగియనుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహిస్తుండటంతో ఈసీఐ నిబంధనల ప్రకారం 48 గంటల ముందు ప్రచారానికి తెరపడాల్సి ఉంది. దీంతో ఈ రోజు సాయంత్రం 6.00 గంటల తర్వాత మైకులు మూగబోనున్నాయి. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా నాలుగో సారి విజయం సాధించి అధికారాన్ని దక్కించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ భావిస్తోంది. మరోవైపు మూడు దశాబ్దాలుగా ఢిల్లీలో అధికార పీఠానికి దూరంగా ఉన్న బీజేపీ.. ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇక ఇండియా కూటమిలోనే ఉన్న కాంగ్రెస్.. ఢిల్లీలో తన మిత్రపక్షమైన ఆప్‌పై పోటీకి దిగింది. ఆప్, కాంగ్రెస్ 70 చోట్ల పోటీ చేస్తుండగా.. ఎన్డీయే కూటమిలోని బీజేపీ 68 స్థానాల్లో పోటీకి దిగింది. మిగిలిన రెండు సీట్లను జేడీయూ, ఎల్‌జేపీకి కేటాయించింది. సీపీఐ 6, సీపీఎం 2, సీపీఐ ఎంఎల్ 2 సీట్లలో పోటీ చేస్తున్నాయి. బీఎస్పీ 70, ఎన్సీపీ 30, ఏఎస్పీ (కాన్షీరాం) 15, ఏఐఎంఐఎం రెండు చోట్ల బరిలోకి దిగాయి.



నాగోల్‌లోని శుభం కన్వెషన్‌లో చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహగుప్త కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణ, కాచం సుష్మ, కొట్టూర్ వీరేందర్, దీము మహేందర్ యాదవ్ తదితరులు.

- విశ్వంభర, చైతన్యపురి

# ప్రపంచ యవనికపై రాణించేందుకు ఇంగ్లిష్ కీలకం

### సింగరేణి సీఎండీ బలరాం




**విశ్వంభర, ఉస్మానియా యూనివర్సిటీ :** ఇంగ్లిష్ భాషను అందరు కష్టపడి నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని చెప్పారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం ద్వారా అయా రంగాల్లో రాణించేందుకు సులువవుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ద్వారా గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఆదివారం ముగిసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 66 మంది యూజీ చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఈ కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ అందించారు. విద్యార్థులకు ఓయూలో నెలరోజుల పాటు వసతి కల్పించి, శిక్షణ అందించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఈ క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బలరాం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యాభివృద్ధికి, లైబ్రరీల ఏర్పాటుకు సింగరేణి తరపున ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలకు కూడా విద్యాభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తామన్నారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని అన్నారు. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, కార్యక్రమ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ సవిన్ సౌద, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి, డాక్టర్ మాధవి, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్‌కు వణుకు పుడుతున్నది : కొప్పుల ఈశ్వర్

**విశ్వంభర, జగిత్యాల :** రాష్ట్రంలో కేసీఆర్ పేరు వినిపించినా, కనిపించినా కాంగ్రెస్ పార్టీకి కలవరం మొదలవుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్అన్నారు. ఆదివారం జిల్లాలోని ధర్మపురి మైనారిటీ గురుకుల కళాశాలలో రెండు రోజుల క్రితం ఆహారం వికటించి అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించడానికి ఆయన కళాశాలకు వెళ్లారు. కాగా, మాజీ మంత్రి కొప్పులను కళాశాల లోనికి ప్రినిపాల్ అనుమతించలేదు. కళాశాలలోకి ఎవరిని అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని, అందుకే అనుమతించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కళాశాల గేటు బయట విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయాలని కాంగ్రెస్ సర్కార్ విశ్వప్రయత్నం చేస్తున్నద మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రలో భాగంగానే కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మైనారిటీ కళాశాలలోకి అనుమతించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ చరిత్రను రూపుమాపలేరన్నారు. పరి పాలన చేతకాక తప్పుడు కేసులు పెడుతూ బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.






రాజేంద్రనగర్ పరిధి, ఆరంగర్ వద్ద గల క్వీన్స్ ప్యాలెస్‌లో జరిగిన వివాహవేడుకలో నూతన వధూవరులు సాయికుమార్, భవ్యశ్రీలను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణ, తదితరులు.

- విశ్వంభర, రాజేంద్రనగర్

# నాగోబాను దర్శించుకున్న మాజీ మంత్రి జోగు రామన్న



**విశ్వంభర, ఇంద్రవెల్లి:** ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబాను మాజీ మంత్రి జోగు రామన్నదర్శించుకున్నారు. ఆదివారం ఉదయం కేస్లాపూర్ నాగోబా జాతరకు వచ్చిన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగోబాకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మెస్రం వంశీయులు మాజీ మంత్రిని శాలువాతో సన్మానించి నాగోబా ఫోటో బహూకరించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను విడుదల చేశారు.

ఐదు రోజులపాటు అంగరంగవైభవంగా సాగిన నాగోబా జాతర శనివారం ముగిసిన విషయం తెలిసిందే. నాగోబా దేవతకు మండగాజిలి పూజలతో మెస్రం వంశీయులు జాతరను ముగించారు. నాగశేషుడికి మనసారా మొక్కి వెళ్లొస్తాం నాగోబా అంటూ కెస్లాపూర్ నుంచి బుడుందేవ్ పూజలకు శ్యాంపూర్ బాట పట్టారు. మెస్రం వంశీయుల పూజలు ముగిసినా భక్తుల దర్శనార్థం మరో రెండు రోజుల పాటు జాతర సాగనుంది.

జనవరి 28న పుష్య అమావాస్య అర్ధరాత్రి 11 గంటలకు గంగాజలాభిషేకంతో మహాపూజ ప్రారంభం కాగా.. భేతల్ దేవుడికి మండగాజలి పూజలతో జాతర ముగిసింది. మొదటి రోజు అర్ధరాత్రి మహాపూజ అనంతరం కొత్త కోడళ్ల పరిచయ వేడుక భేటింగ్ సాగగా.. 41 రోజుల ఉపవాస దీక్షలను విరమించిన మెస్రం వంశీయులు రెండో రోజు జాతరలో భాగంగా బాన్ దేవుడికి, పెర్సపేన్ దేవుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

మూడవ రోజు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా.. నాలుగో రోజు గిరిజన సమస్యలకు పరిష్కార మార్గం చూపే గిరిజన దర్బార్ సాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ ఏడాది అధికారులు, ప్రజాప్రతినిధులు వేరు వేరుగా దర్బార్‌లో పాల్గొన్నారు.

# రైతుల ప్రాణాలకు ముప్పుగా కరెంట్ తీగలు



**విశ్వంభర, చండూర్ :** ఎక్కడ చేతులెత్తితే ప్రాణాలు పోతాయో అర్థం అవ్వడం లేదని వ్యవసాయ భూముల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్గొండ జిల్లా, చండూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామంలోని వ్యవసాయ భూములలో విద్యుత్ తీగలు చాలా రోజులుగా క్రిందికి వ్రేలాడుతూనే ఉన్నాయని రైతులు తెలిపారు. వ్యవసాయ భూమికి చెందిన రైతులు చేతులకు అందేలా కరెంట్ తీగలు వేలాడుతూ ప్రాణాల మీదికి తెస్తున్నాయని అన్నారు. ఇదే విషయం పై విద్యుత్ అధికారులు కు పలు మార్లు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న పట్టించుకునే నాదుడే కరువు అయ్యారని రైతు ఇడికూడ మహేష్ వాపోయారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో భయంగా ఉందని రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలనీ ఉన్నత అధికారులును కోరుతున్నారు.




## బీమా రంగంలో వందశాతం

# విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రమాదకరం

**బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతాన్ని 74 శాతం నుండి 100 శాతానికి పెంచాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భాగంగా ప్రతిపాదించారు. అయితే వందశాతం ఎఫ్‌డీఐ అనుమతి కోరే కంపెనీలు తాము వసూలు చేయబోయే ఇన్సూరెన్స్ ప్రీమియంలను భారత దేశంలోనే పెట్టుబడులుగా పెట్టవలసి ఉంటుందని, ఆ నిబంధనకు లోబడి అనుమతిస్తామని మంత్రి ప్రకటించారు.**

మితవాద జాతీయవాదమే దేశాన్ని ముందుకు నడిపించే ఏకైక మార్గమని నమ్మే వారికి, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహానికి గేట్లు తెరిచిన చారిత్రక క్రమం గురించి, దశలవారీగా కేంద్రం తీసుకున్న నిర్ణయాల పట్ల అవగాహన అంతగా లేని వారు ఈ షరతుతో (ప్రీమియంలను భారత్ లో పెట్టుబడులుగా వినియోగించాలన్న) సంతృప్తి పడవచ్చు.కానీ 2015 లోనే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతాన్ని 26% నుండి 49% కి పెంచినప్పుడే అంతకు ముందు నుండే అమలులో ఉన్న రీపాట్రియేషన్ క్లాజ్ ( విదేశీ కంపెనీలు ఆర్జించిన లాభాలను కనీసం మూడు సంవత్సరాల వరకు దేశ సరిహద్దులు దాటకుండా ఇక్కడే పెట్టుబడులుగా వినియోగించాలనే నిబంధన) ను తొలగించేశారు. ఇపుడు ఈ క్లాజు గురించిన ప్రస్తావన కేవలం కంటి తుడుపు మాత్రమే కాదు.. మోసకారి చర్య కూడా.

రిపాట్రియేషన్ క్లాజ్ తొలగించిన తర్వాత యథేచ్ఛగా ఎప్పుడైనా కంపనీలు తామార్జించిన లాభాలు విదేశాలకు తరలించుకు పోయే అవకాశమున్న తర్వాత ప్రీమియంలు మాత్రమే ఈ దేశంలో వినియోగించాలని పెట్టే నిబంధన నామమాత్రమైనదే.

ఇన్సూరెన్స్ రంగం దీర్ఘకాలిక కాంట్రాక్ట్స్ అమలు పరిచే నమ్మకమైన స్థితిలో ఉండాలి. కాబట్టి అట్టి రంగం ప్రభుత్వ రంగంలోనో లేదా దేశీయ భాగస్వాములతోనో కలిసి ఉంటేనేనో మేలు అన్న అభిప్రాయం ఇన్సూరెన్స్ రంగాన్ని 2000 సంవత్సరంలో ప్రైవేట్ కంపెనీ లకు బార్లా తెరవక ముందు నుండి, ఆ తర్వాత కూడా వ్యక్తమవుతూనే ఉన్నది. అందుచేతనే ఉన్న ఫళంగా ఎఫ్‌డీఐ లిమిట్ ను 74% నుండి 100% కు పెంచితే విమర్శనాస్త్రాలు పెరుగుతాయని తమను తాము కాస్త విమర్శల నుండి రక్షించుకునే ప్రక్రియలో భాగమే బడ్జెట్‌లో ఒక చిన్న మెలిక లాంటి వెసులుబాటును పెట్టుకున్నారు.

భారత ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డిఐలు వందశాతం అనుమతించబడిన తరువాత ఇప్పటి వరకు దేశీయ కంపెనీలతో భాగస్వాములుగా ఉంటూ నడిచిన అనేక కంపెనీలు తమకు తాము 100% ఎఫ్‌డీఐని తెచ్చుకొని దేశీయ భాగస్వామ్య కంపెనీలను కాలదన్నడం ఖాయం. అనగా ఇక నుండి భారతదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో అన్నీ విదేశీ కంపెనీలే ఉండే అవకాశాలకు ఇది నాంది.

ఇదివరకే ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ చట్ట సవరణలలో ఒక బీమా కంపెనీని నెలకొల్పడానికి కావాల్సిన కనీస మూల ధనాన్ని కూడా తగ్గించాలనే ప్రతిపాదన ఉన్నది. 100% ఎఫ్‌డీఐలకు అనుమతి దొరికిన తర్వాత విదేశీ కంపెనీలు అత్యంత తక్కువ మూలధనంతో తమ దుకాణాలను ఇక్కడ తెరుచుకోవడానికి మార్గం మరింత సుగమం అయినట్లే!

దీంతో పాటు ఇన్సూరెన్స్ చట్ట సవరణలలో; మల్టిపుల్ ఏజెన్సీ అనగా ఒక ఏజెంట్ అనేక కంపెనీలతో ఏజెన్సీ ని కలిగి ఉండడం; మరియు ఏజెన్సీ పోర్టబిలిటీ అనగా ఓ ఏజెంట్ ఒక కంపెనీ నుండి మరో కంపెనీకి బదిలీ అయ్యే అవకాశం; పాలసీ పోర్టబిలిటీ అనగా ఒక పాలసీదారుడు ఒక కంపెనీ నుండి మరో కంపెనీకి మారిపోవడం.. వంటివన్నీ చకచకా జరిగిపోయేందుకు భీమా సుగమ్ అనేపేరున మూలధన ఆవశ్యకత లేకుండానే ఇంటర్నెట్ కెఫెలు లాంటి దుకాణాలు తెరుచుకునే వెసులుబాటును కూడా పొందుపరిచారు.

బీమా చట్ట సవరణలన్నీ రూపుదాల్చి, 100% ఎఫ్‌డీఐ అనుమతి చట్టరూపమైతే అత్యంత ప్రధానమైన మరియు దీర్ఘ కాలంలో నమ్మకంతో సేవలందించే అవసరమున్న భీమా రంగం పూర్తిగా విదేశీ సంస్థల హస్తగతమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. 1956 కు ముందు భారతదేశంలో విదేశీ స్వదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలన్నీ కలగలిసి చేసిన మోసాలు చరిత్ర సాక్ష్యాలుగా ఉండబట్టి ఆనాటి ప్రధానమంత్రి జవాహరలాల్ నెహ్రూ ఆర్థిక మంత్రి సిడి దేశ్‌ముఖ్ పూనుకుని 245 ప్రైవేట్ కంపెనీలు అన్నింటినీ కలిపి జాతీయకరణ చేసి పాలసీదారులకు భద్రత కల్పించడమే కాకుండా సేకరించబడిన చిన్న మొత్తాలన్నింటి ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ఉపయోగపడ్డారు.

ఈరోజు గుత్త సంస్థలు లాభాపేక్ష కోసం పెరుగుతున్న ఆ కాస్త మధ్యతరగతి వ్యక్తుల ఆదాయాలపై కన్నేసి లాభాలు ఆర్జించడానికి వేసిన పన్నాగంలో ప్రభుత్వాలు ప్రజలను సమిధలుగా మారుస్తున్నాయి. ఇది చాలా దురదృష్టకరం.

ఆర్థిక ముఖ్య సలహాదారు అనంత నాగేశ్వరన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో స్పష్టంగా చెప్పబడిన అంశం ఏమంటే ప్రభుత్వ రంగ ఎల్ఐసీ మూలంగానే ఈరోజు దేశంలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ పెరిగింది అని, అనగా ఈ 24 ఏళ్ల ప్రైవేట్ కంపెనీల ప్రయాణ పరంపరలో దేశంలో ఇన్సూరెన్స్ రంగ అభివృద్ధికి అవి ఇచ్చిన తోడ్పాటు ఏమీ లేదు అని ఈ ఆర్థిక సర్వే ద్వారా స్పష్టమైంది. దీని బట్టి అర్థమైంది ఏమంటే గతంలో మాదిరిగానే ఆర్థిక సర్వేలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ప్రధాన రంగాలను వదులుకోవడానికి ప్రభుత్వాలు మొగ్గుచూపుతున్నాయి.

ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిపాదించబడుతున్న సంస్కరణల్ని ప్రజలకు మరింత ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించడానికి లేదా పొదుపు మొత్తాలను సేకరించి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించడానికి అన్న ఆశయం కన్నా బహుళజాతి కంపనీలు తమ వ్యాపారాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగకరంగా ఉండడమే లక్ష్యంగా ఉన్నవి.

ఏ సంస్కరణలైన జరిగిన నష్టాన్ని పూడ్చాలి, అభివృద్ధి పథంలోకి అడుగులు వేయించాలి. కానీ ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిపాదించబడుతున్న సంస్కరణలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్న ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్య పరిచి పెట్టుబడులకు పెద్దగా ఆస్కారం లేని సేవారంగంలోకి వచ్చి హామీలను మాత్రమే ఇచ్చి సొమ్ము చేసుకోవడానికి గుత్త మరియు బహుళజాతి సంస్థలకు అనుమతులు ఇవ్వడానికి మాత్రమే చోటుచేసుకుంటున్నాయి.

నిజానికి ఇన్సూరెన్స్ రంగంపై అత్యధిక మంది భారత పార్లమెంటేరియన్లకు అంతగా అవగాహన లేదు. పౌర సమాజంలోనూ దీనిపైన విస్తృతమైన విషయ సంగ్రహణ ఉండదు. ఇన్సూరెన్స్ ఒక అవసర వస్తువు కాదు. ఇన్షూరెన్స్ లేని లోటు కనపడదు. కానీ సమగ్రమైన పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ ప్రజలందరికీ ఉంటే కుటుంబాల ఆర్థిక స్థితిగతుల కొనసాగింపుకు ఎలాంటి ధోకా ఉండదు. ఎంతటి సూక్ష్మమైన ప్రధాన అంశం ఆర్థికవేత్తలకు సామాజిక దృక్కోణంలో ఆలోచించేవారికి మాత్రమే అవగతమవుతోంది.

అయితే ఈ ఇన్సూరెన్స్ రంగం సృష్టిస్తున్న సంపద చాలా పెద్దమొత్తంలో ఉంటుంది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను 8,00,000 కోట్ల రూపాయల పైనే ఇన్సూరెన్స్ వ్యాపారం దేశంలో జరిగింది ఒక్క ఎల్ఐసీ ఆఫ్ ఇండియా 4,75,000 కోట్ల ప్రీమియంను సేకరించగలిగింది. ఇది మరింత విస్తరించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీని మౌలిక స్వభావమైన కో ఆపరేటివ్ వెంచర్ ద్వారా ఒకరికి జరిగిన నష్టాన్ని మిగతా వారందరూ భర్తీ చేసే విధానం లాభాపేక్షకు తావులేనిచోట మాత్రమే సక్రమంగా ఉండగలదు. లాభాపేక్షకు అవకాశం ఉండే ప్రైవేట్ కంపెనీల వ్యాపార చట్రంలోకి ఇది నెట్టివేయబడ్డప్పుడు పలితాలు ప్రజా సంకటంగానే మారుతాయి. అందుచేత ప్రభుత్వ రంగంలోనే ఉండవలసిన ఇన్సూరెన్స్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడమే సరైనది కానప్పుడు దానిని పూర్తిగా విదేశీ సంస్థల హస్తగతం చేయడం మరింత ప్రమాదకరం.



-జి.తిరుపతయ్య
ఇన్స్యూరెన్స్ రంగ నాయకులు

# సర్వోన్నత జ్ఞానదాయిని సరస్వతీ దేవి



వసంత పంచమిని మాఘ శుద్ధ పంచమి నాడు జరుపుతారు. దీనిని శ్రీ పంచమి అని, మదన పంచమి అని అంటారు. మాఘశుద్ధ పంచమి సరస్వతీదేవి జన్మించిన రోజు. కనుకనే ఈ పండుగను యావత్ భారతదేశంలో విశేషంగా జరుపుకునే ఆచారం సనాతనంగా వస్తుంది. ఈ రోజు సరస్వతీ దేవికి పూజ చేయాలి. రతీ మన్మథులను పూజించి మహోత్సవం చేయాలని, దానాలు చేయాలని, ఇలా ఆచరించడం వలన మాధవుడు (వసంతుడు) సంతోషిస్తాడని నిర్ణయామృతం తెలుపుతుంది. అందువల్ల దీనిని "వసంతోత్సవము" అని కూడా అంటారు. "మాఘ శుద్ధ పంచమి నాడు వసంత ఋతువు ప్రారంభమౌతుంది. ఈరోజు శ్రీ విష్ణువును పూజించాలి. చైత్ర శుద్ధ పంచమి నాడు బ్రాహ్మణులకు సంతర్పణ చేయాలి" అని 'వ్రత చూడామణి' పేర్కొంటుంది.

**జ్ఞాన ప్రాప్తి కోసమే వాగ్దేవీ ఆరాధన..**

శ్రీ సరస్వతిదేవి ని జ్ఞాన సరస్వతి దేవి గా బాసర దేవాలయంలో వసంత పంచమి విశిష్ట సరస్వతీ దేవిని మాఘపంచమి నాడు శ్రీపంచమి పేరిట ఆరాధిస్తారు. సర్వవిద్యలకూ ఆధారం వాగ్దేవే. కనుక చిన్నపెద్ద తేడాల్లేకుండా పుస్తకాలు, కలాలు అమ్మవారి దగ్గర పెట్టి ఈ రోజున భక్తితో ఆరాధిస్తారు. సంగీత నృత్యసాహిత్యాలకు కూడా ఈ దేవీ యే మూలం. కనుక ఈ తల్లిని నృత్యకేళీగీతాదులతో స్తుతిస్తారు. ఈ శ్రీపంచమినే వసంత పంచమి అని మదన పంచమి అని అంటారు. ఈ తల్లిని జ్ఞానప్రాప్తి కోసం ఆరాధించమని 'బ్రహ్మావైవర్తపురాణం' చెబుతోంది. ఈ శ్రీపంచమినాడు సరస్వతిని ఆరాధించే విధివిధానాలను నారదునకు శ్రీమన్నారాయణుడు వివరించినట్లు 'దేవీ భాగవతం' వివరిస్తోంది.


మాఘ మాసం శిశిర ఋతువులో వసంతుని స్వాగత చిహ్నంగా ఈ పంచమిని భావిస్తారు. ఋతురాజు వసంతుడు కనుక వసంతుని, ప్రేమను కలిగించేవాడు మదనుడు కనుక మదనుణ్ణి, అనురాగ వల్లి అయిన రతీదేవిని ఆరాధన చేయటం కూడా శ్రీపంచమినాడే జరుగుతుంది. వీరి ముగ్గురిని పూజించడం వల్ల వ్యక్తుల మధ్య ప్రేమాభిమానాలు కలుగుతాయి. దానివల్ల జ్ఞాన ప్రవాహాలు ఏర్పడుతాయి.

ఇక అమ్మ దగ్గర అక్షరాభ్యాసం చేయస్తే పిల్లలు జ్ఞానవంతులు అవుతారు. సరస్వతి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. అమ్మ కరుణతో సద్బుద్ధిని కూడా పొందుతారు. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. అందుకే ఈ దేవిని 'శివానుజ' అని పిలుస్తారు. శరన్నవరాత్రులల్లో మూలా నక్షత్రం రోజున సరస్వతీ రూపంలో దుర్గాదేవిని ఆరాధించినప్పటికీ మాఘ మాసంలో పంచమి తిథినాడు సరస్వతీదేవికి ప్రత్యేక ఆరాధనలు విశేష పూజలు చేస్తారు.

''చంద్రికా చంద్రవదనా తీవ్రా మహాభద్రా మహాబలా భోగదా భారతీ భామా గోవిందా గోమతీ శివా'' అని ప్రతిరోజూ గాని, పంచమినాడు సప్తమి తిథులలో గాని, సరస్వతీ జన్మనక్షత్రం రోజు గాని పూజించిన వారికి ఆ తల్లి కరుణాకటాక్షాలు పుష్కలంగా లభిస్తాయని సనాతనులు నమ్ముతారు.

**అమ్మ దయ వుంటే అన్నీ ఉన్నట్లే..**

అహింసకు అధినాయిక సరస్వతిదేవి. సరః అంటే కాంతి. కాంతినిచ్చేది కనుక సరస్వతి అయింది. అజ్ఞాన తిమిరాంధకారాన్ని దూరం చేసి విజ్ఞాన కాంతికిరణ పుంజాన్ని వెదజల్లే దేవత సరస్వతీ దేవి. ఈ అహింసామూర్తి తెల్లని పద్మంలో ఆసీనురాలై వీణ, పుస్తకం, జపమాల, అభయ ముద్రలను ధరించి ఉంటుంది. అహింసామూర్తి కనుకనే ఈ తల్లి చేతిలో ఎటువంటి ఆయుధాలు ఉండవు. జ్ఞానకాంతిని పొందినవారికి ఆయుధాల అవసరం ఏమీ వుండదు కదా! ఈ తల్లిని తెల్లని పూవులతోను ,శ్వేత వస్త్రాలతోను, శ్రీగంధంతోను, అలంకరిస్తారు. పచ్చని వస్త్రాలను లేక తెల్లని వస్త్రాలను ధరించి తెల్లని పూలతో అర్చనాదులు చేసి క్షీరాన్నాన్ని, నేతితోకూడిన వంటలను, నారికేళము, అరటిపండ్లను చెరకును నివేదన చేస్తారు. ఆ తల్లి చల్లని చూపులలో అపార విజ్ఞాన రాశిని పొందవచ్చు.వ్యాసవాల్మీకాదులు కూడా ఈ తల్లి అనుగ్రహంతోనే వేదవిభజన చేయడం, పురాణాలు, గ్రంథాలు, కావ్యాలు రచించగలిగారని అంటారు. అశ్వలాయనుడు, జగద్గురు ఆదిశంకరాచార్యులు కూడా ఈ తల్లిని ఆరాధించారని తెలుస్తుంది. ఎవరేమన్నా అమ్మ దయ వుంటే అన్నీ ఉన్నట్లే కదా!





"సాహిత్య కళా విభూషణ"
- చౌదూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
చరవాణి:9705100788



# పాత తరాన్ని ఫాలో అయిపోదాం

నాటి తరానికి తెర అంటే.. టీవీ మాత్రమే! సినిమా అంటే.. ఆదివారమే! కానీ, ఇప్పటి పిల్లలు రోజంతా స్క్రీన్‌లోనే గడిపేస్తున్నారు. ఆటలే కాదు, పాఠాలు కూడా స్క్రీన్‌కు అంకితమై వింటున్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్.. ఇలా స్క్రీన్ ఉచ్చులో చిక్కుకొని అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. దేశంలో దాదాపు 61 శాతం మంది తల్లిదండ్రులు, తమ పిల్లల స్క్రీన్‌టైమ్ గురించి ఆందోళన చెందుతున్నారని పలు పరిశోధనల్లో తేలింది. స్మార్ట్ దునియాలో చక్కర్లు కొడుతున్న బాల్యం.. పిల్లల భాషాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతున్నదనీ, వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నదని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. అందుకే, పిల్లల స్క్రీన్‌టైమ్ తగ్గించాలనీ, వారిని ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలనీ సూచిస్తున్నారు.

**పుస్తకాలే నేస్తాలు..**

నైంటీస్ కిడ్స్ దాచుకున్న స్లామ్‌బుక్స్‌ను ఒక్కసారి తిరగేయండి. చాలా పేజీల్లో హాబీస్ దగ్గర.. 'రీడింగ్ బుక్స్' అనే కనిపిస్తుంది. పుస్తకాలే నేస్తాలుగా గడిచిన బాల్యం వాళ్లది. చందమామ కథలు చదువుతూ.. నిద్రలోకి జారుకున్న తరం వాళ్లది. మరిప్పుడో.. స్కూల్ బుక్స్, హోమ్ వర్క్ తప్ప, వేరే పుస్తకమే తెలియకుండా రోజులు గడిపేస్తున్నారు. కాబట్టి.. మీ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచండి. ప్రతిరోజూ పడుకునే ముందు.. వారికి ఒక మంచి పుస్తకం ఇచ్చి చదవమనండి. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. భాషా నైపుణ్యాలూ మెరుగుపడుతాయి.

**ప్రకృతి ప్రేమికులు..**

నాటికాలం పిల్లలు.. ప్రకృతి ప్రేమికులు. చుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూసే ఎక్కువగా నేర్చుకున్నారు. నేటితరానికి ఇల్లు, స్కూలూ తప్ప.. వేరే ప్రాంతం పెద్దగా తెలియదు. అయితే.. ప్రకృతితో మమేకమైతేనే.. పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. సమస్య-పరిష్కార సామర్థ్యాలు మెరుగుపడతాయన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. అందుకే.. ప్రకృతిలో ఉన్న వింతలను, సహజత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వైరస్‌లు, బ్యాక్టీరియాలు అంటూ భయపెట్టకుండా.. పిల్లల్ని స్వేచ్ఛగా మట్టిలో ఆడుకోనివ్వాలి. నీళ్లలో గెంతనివ్వాలి. ప్రకృతిని ప్రేమించేలా.. వారిని ప్రోత్సహించడం చాలా అవసరం.

**బంధాలతో అనుబంధం**

90వ దశకంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఏ పండుగొచ్చినా ఇళ్లన్నీ జనాలతో అనుబంధాల కలబోతలా కళకళలాడేవి. నలుగురు కలిసి ఒక ఇంట్లో ఉండటమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో.. ఇప్పటితరం కుటుంబంతో కన్నా సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువగా గడుపుతున్నది. ఫలితం.. మనిషికి ఉండాల్సిన సహజ భావోద్వేగాలు కూడా మృగ్యమైపోతున్నాయి. ఈ పోకడ.. వారి భవిష్యత్తులో మరిన్ని విపత్కర పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి, పిల్లల మధ్య ప్రేమానురాగాలు పెరిగేలా చూడండి. రోజుకు ఒకపూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా ప్లాన్ చేసుకోండి. అన్నదమ్ముల పిల్లలను తరచూ కలుసుకునే పరిస్థితులు కల్పించండి. తద్వారా వారికి బంధాల విలువ తెలిసొస్తుంది.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

- ఇద్దరు కేంద్ర మంత్రులున్నా స్వరాష్ట్రానికి నిధులు సున్నా
- బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు నివేదికలే తెలంగాణకు శాపం
- బడ్జెట్‌ను సవరించి తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించండి
- కేంద్రాన్ని డిమాండ్ చేసిన మంత్రి సీతక్క



**విశ్వంభర, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని మంత్రి సీతక్క ఆక్షేపించారు. నూతన రాష్ట్రమైన తెలంగాణ పై కేంద్రం పక్షపాత వైఖరితో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని గౌరవిస్తూ ఏపీకి బడ్జెట్ లో నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ రాష్ట్రాన్ని మాత్రం మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 62 పేజీల బడ్జెట్ ప్రసంగ పాఠంలో, 77 నిమిషాల ప్రసంగంలో తెలంగాణ పదం లేకపోవడం తెలంగాణ పట్ల బీజేపీ సర్కార్ ప్రదర్శిస్తున్న వివక్షతకు అద్దం పడుతుందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణకు ఏ ఒక్క ప్రాజెక్టును, ప్రత్యేక ప్రయోజనాలను మంజూరు చేయక తెలంగాణను బీజేపీ అన్యాయం చేసిందని, దీన్ని ఊరురా ఎండగడతామని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను, ఇద్దరు కేంద్ర మంత్రులను గెలిపిస్తే..తెలంగాణకు కేంద్రం గుండు సున్నా ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి ఒక రూపాయి వెళితే.. 42 పైసలే తెలంగాణకు తిరిగి వస్తున్నాయని..అలాంటప్పుడు తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఎందుకు కేటాయించరని కేంద్రాన్ని సీతక్క ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ ..తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడానికే పరిమితం అవుతుందని సీతక్క పేర్కొన్నారు. అయితే గతంలో తప్పుడు నివేదికలతో కేంద్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించమే నిధులు రాకపోవడానికి కారణమని సీతక్క తెలిపారు. గొప్పలకు పోయి, ధనిక రాష్ట్రమని భ్రమలు కల్పించడం వల్లే రావాల్సిన నిధులు తెలంగాణకు రావడం లేదన్నారు. బీజేపీ పాపంలో బీఆర్ఎస్ పాత్ర ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 1059 గ్రామాలు, ఆవాసాల్లో మిషన్ భగీరథ వ్యవస్థ ఏర్పాటు కాకున్నా..మిషన్ భగీరథ వంద శాతం పూర్తయినట్లు తప్పుడు నివేదికలు కేంద్రానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సమర్పించడం వల్లా..గ్రామీణ తాగు నీటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునే అవకాశాన్ని రాష్ట్రం కొల్పోయిందన్నారు. తెలంగాణలో వెనకబడిన ప్రాంతాలు లేవని కేంద్రానికి బీఆర్ఎస్ గతంలో నివేదించిందని...దీంతో ఏపీ వెనకబడిన ప్రాంతాలకు అభివృద్ధి నిధులు మంజురు చేసిన కేంద్రం..తెలంగాణకు మాత్రం నయా పైసా విదిల్చ లేదని ఆవేదన వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ వాస్తవాలు దాచిన ఫలితమే తెలంగాణకు శాపంగా మారిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను పక్కకు పెట్టడానికి బీఆర్ఎస్ తీరే కారణమన్నారు సీతక్క. అయితే తెలంగాణకే కాదు..యావత్ దేశ ప్రజలను కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందన్నారు మంత్రి సీతక్క. పంట పెట్టుబడి సహాయం కోసం కిసాన్ సమ్మాన్ యోజన మొత్తాన్ని పెంచుతామని క్యాబినెట్లో నిర్ణయించినా..బడ్జెట్ లో మాత్రం పెంపు ప్రతిపాదన లేదని గుర్తు చేసారు. 60 ఏళ్లు దాటిన రైతులకు నెలవారి పించన్లు అందిస్తామని 6 ఏండ్ల కింద హామీ ఇచ్చిన కేంద్రం ..ఈ ఏడాది బడ్జెట్ లో కూడా పించన్ల ప్రస్తావన చేయలేదని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య, ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పన విషయంలో నిర్దిష్టంగా నిధులు కేటాయించకుండా.. వట్టి మాటలతోనే బడ్జెట్ ను సరిపుచ్చారని వెల్లడించారు. నిర్థిష్టంగా ఈ ఏడాదికి సంబంధించిన కేటాయింపులను స్పష్టం చేయకుండా..పంచ వర్ష ప్రణాళికల మాదిరిగా.. వచ్చే ఏదేల్ల కోసమంటూ భారీ గణాంకాలతో గారడి లెక్కలతో ప్రజలను మభ్య పెట్టేలా కేంద్రం బడ్జెట్ రూపొందించిదని ఆక్షేపించారు సీతక్క. కనీసం బడ్జెట్ చర్చ సందర్భంగా..సభ్యులు అభిప్రాయాలకు అనుగుణంగా బడ్జెట్ లో తెలంగాణ కు, సగటు జీవికి ప్రధాన్యత కల్పించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేసారు.

## తాగునీటి కొరత రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్

**- జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** రూపొందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పంచాయతీ, నీటిపారుదల ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, అన్ని మండలాల ఎం.పి.డి.ఓ, ఎం.పి.ఓ లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బోర్ల పనితీరుపై నివేదికలు ఇవ్వాలని, మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలోని త్రాగునీటి వనరులను తక్షణమే పునరుద్ధరించాలన్నారు.

## పోలీసుల అవగాహన కార్యక్రమం




**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని చిన్ననాగారంలో నెల్లికుదురు ఎస్ఐ చిర్ర రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక సంస్థల ఎలక్షన్లు, సైబర్ క్రైమ్స్, మారకద్రవ్యాల పైన గ్రామస్తులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రజలకు పలు సూచనలు ఇస్తూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా జరిగే విధంగా సహకరించాలన్నారు.సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా ఏమాత్రం అనుమానం వచ్చినా 1930 ఫోన్ నెం.కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. అపరిచితుల ఫోన్ లిఫ్ట్ చేయొద్దని సూచించారు. గంజాయి డ్రగ్స్ వంటి మారక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని, తమ పిల్లలపై ఒకన్నేసి ఉంచాలని చెప్పారు. అక్రమ రవాణాకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు.కార్యక్రమంలో ఏఎస్ఐ యాకయ్య, పోలీసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చిప్పలపల్లి రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, నీర్నెముల గ్రామానికి చెందిన కందిమల్ల గోపాల్ రెడ్డి రాములమ్మ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, గ్రామ అధ్యక్షులు చిప్పలపల్లి ఉపేందర్, చిప్పలపల్లి కుమార్, నోముల విష్ణు, నోముల కృష్ణ, నోముల నర్సింహా,ముత్యాల శివ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నూతన దంపతులను
## ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మాజీ సర్పంచ్ తిరునగిరి వేణుగోపాల్ ప్రవీణ కుమారుడు పవన్ కళ్యాణ్ శ్రీవల్లి పెళ్లి కి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ ఛైర్మన్ గీత నరసింహ ముదిరాజ్ డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షులు బిచ్చ నాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అర్కోటం బాలరాజ్ చేగురి వెంకటేష్, హనుమాన్ నాయక్, రామచంద్రనాయక్, జాంగిర్ అలీ, చందోజి, మంకీ శ్రీను, నేతి ప్రభు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### లక్ష డప్పులు వేల గొంతుకల
## మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ




**విశ్వంభర, కాళేశ్వరం:** హైదరాబాదులో ఈనెల 7న జరగనున్న లక్ష డప్పులు, వేల గొంతుకలు మహా ప్రదర్శన పోస్టర్ ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో ఆవిష్కరించారు. ఎస్సీల వర్గీకరణ ధ్యేయంగా జరుగుతున్న మహా ప్రదర్శనలు విజయవంతం చేసుకుని వర్గీకరణ అయ్యేవరకు నిరంతరం పోరాడితేనే ఉంటామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడవ తేదీ లోపే వర్గీకరణ అమలు చేయాలని ఆ ప్రదర్శనలు ఆనంద ఉత్సవంతో మహా ప్రదర్శన విజయవంతం చేసుకునే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లేని పక్షంలో లక్షలాది డప్పులు చావు డప్పు లై మోగుతాయని బెల్లంపల్లి సురేష్ మాదిగ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జిల్లాల నాగరాజు, మండల యువసేన అధ్యక్షులు మంథని రవితేజ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ధర్మయ్య, లేత్కరి రాజయ్య, లేత్కరి రాజబాబు ,బెల్లంపల్లి రాజయ్య ఎమ్మార్పీఎస్ గ్రామ మాజీ అధ్యక్షులు చకినారపు గణపతి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు
# అధికారులు సన్నద్ధంగా కావాలి

**- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** రాబోయే గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారీ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎం.పి.డీ.ఓ లు ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సిబ్బంది ఎన్నికల సమయంలో ఏ బాధ్యతలను నిర్వర్తించాలో స్పష్టమైన ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. ఎన్నికలు వస్తే చేయాల్సిన పనులను మండల పంచాయతీ అధికారి, ఎం.పి.డి.ఓ కలిసి లిస్ట్ ఔట్ చేసుకోవాలని, ప్రతి పనికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించాలని, అవసరమైన సిబ్బంది, మెటీరియల్ వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థ ఎన్నికలు వేరువేరుగా ఉంటాయని, స్థానికత పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను విభజించాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పరిశీలనకు అవసరమైన బృందాలు ఏర్పాటు చేసుకుని సన్నద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డి.పి.ఓ హరిప్రసాద్, జడ్పీ సీఈవో పురుషోత్తం, సి.పి.ఓ సుబ్బారావు, డి.ఈ.ఓ డాక్టర్ రవీందర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ రాములు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో
## బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



విశ్వంభర, మూసాపేట: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు నల్ల తిరుపతయ్య గౌడ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని మూసాపేట మండల బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు నల్ల తిరుపతయ్య గౌడ్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం కేటాయించిన తర్వాతనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 42 శాతం రిజర్వేషన్లు పెంచితేనే బీసీలు రాజకీయంగానే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ రంగాల్లో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో మండలంలోని ఊరూరా బీసీ పొలిటికల్ జేఏసీ గ్రామ కమిటీలను ఏర్పరచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఫిబ్రవరి 7న లక్షల డప్పులు - వేల గొంతులు

* హైదరాబాద్ లో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయండి

**- రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**విశ్వంభర, కడ్తాల్:** మూడు దశాబ్దాల కాలం నుండి ఎస్సీ వర్గీకరణ కొరకై ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ ఎస్సీ వర్గీకరణ అమలుపై లక్షల డప్పులు, వేల గొంతుకల కార్యక్రమం గోడ పత్రికను కడ్తాల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ పూలే కిరణ్, కడ్తాల్ మండల అధ్యక్షుడు అబ్బు రమేష్, కడ్తాల్ మండల అధ్యక్షుడు కంబాల శ్రీకాంత్ లతో కలిసి రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆవిష్కరించారు. ఆగస్టు 1 2024న సుప్రీంకోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేసుకునే సంపూర్ణ అధికారం రాష్ట్రాలకే ఇచ్చినప్పటికిని ఇట్టి విషయంలో అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ దేశంలోనే అందరికంటే ముందు అమలు చేస్తామని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. లక్షల డప్పులు వేల గొంతుకల ద్వారా వచ్చే గుండెచప్పుల్లను ప్రపంచానికి వినబడేలా చేసే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేష్, ఎమ్మార్పీఎస్ గ్రామ పాధ్యక్షులు గురిగల్ల నరేష్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ ఉపసర్పంచ్ పాండు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్, ముత్తి కృష్ణ, కుమార్, జగన్, మహేష్, అశోక్, వెంకటేష్, శ్రీను,కృష్ణ, సురేష్,రమేష్, వేణు,మహేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట పరిధిలో ఉన్న బకాయిలు అన్నీ పూర్తి చేయాలి




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ఏ.ఎల్.ఓ కార్యాలయ పరిధిలో ఉన్న పెండింగ్ బకాయిలు అన్నీ పూర్తిచేసి కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగే సోములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేటలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాల్లో భాగమైన బకాయిలు ఏండ్ల తరబడి రామన్నపేటలో పెండింగ్లో ఉన్నవని నిత్యం లేబర్ కార్యాలయం చుట్టూ కార్మికులు తిరిగి ప్రదక్షణలు చేస్తున్నారని అన్నారు. స్థానిక ఏఎల్ఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే ఇదంతా జరుగుతుందని వెంటనే పెండింగ్లో ఉన్న బకాయిలు అన్నింటిని పూర్తిచేసి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని అన్నారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో రామన్నపేట ఏఎల్ఓ కార్యాలయం ముందు పెద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొల్లూరు నాగరాజు, సీనియర్ నాయకులు దుర్క నర్సింహా, గొరిగే మల్లేష్, వెంకట్రావు, నాగేశ్వర్ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేడే వసంత పంచమి



**విశ్వంభర, కాళేశ్వరం:** వసంత పంచమి మాఘ శుద్ధ పంచమి నాడు జరుపబడును. దీనిని శ్రీ పంచమి అని మదన పంచమి అని కూడా అంటారు. మాఘశుద్ధ పంచమి సరస్వతీదేవి జన్మించిన రోజు. ఈ పండుగ యావత్ భారతదేశంలో విశేషముగా జరుపుకుంటారు. ఈరోజు సరస్వతి అమ్మ దగ్గర అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు జ్ఞాన రాశులు కలవారు అవుతారు. సరస్వతి ఆరాధన వల్ల వాక్ శుద్ధి కలుగుతుంది. అమ్మ కరుణతో సద్బుద్ధినీ పొందుతారు. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. అందుకే ఈ దేవిని శివానుజ అని పిలుస్తారు. శరన్నవరాత్రులల్లో మూలా నక్షత్రం రోజున సరస్వతీ రూపంలో దుర్గాదేవిని ఆరాధించినప్పటికీ మాఘ మాసంలో పంచమి తిథినాట సరస్వతీదేవికి ప్రత్యేక ఆరాధనలు విశేష పూజలు చేస్తారు. ''చంద్రికా చంద్రవదనా తీవ్రా మహాభద్రా మహాబలా భోగదా భారతీ భామా గోవిందా గోమతీ శివా'' అని ప్రతిరోజూగాని, పంచమినాడు సప్తమి తిథులలో కాని, సరస్వతీ జన్మ నక్షత్రం రోజు గాని పూజించిన వారికి ఆ తల్లి కరుణాకటాక్షాలు పుష్కలంగా లభిస్తాయి. అహింసకు అధినాయిక సరస్వతిదేవి. సరః అంటే కాంతి. కాంతినిచ్చేది కనుక సరస్వతి అయింది. అజ్ఞాన తిమిరాంధకారాన్ని దూరం చేసి విజ్ఞాన కాంతికిరణ పుంజాన్ని వెదజల్లే దేవత సరస్వతీ.ఈ అహింసామూర్తి తెల్లని పద్మములో ఆసీనురాలై వీణ, పుస్తకం, జపమాల, అభయ ముద్రలను ధరించి ఉంటుంది. అహింసామూర్తి కనుకనే ఈ తల్లి చేతిలో ఎటువంటి ఆయుధాలు ఉండవు. జ్ఞానకాంతిని పొందినవారికి ఆయుధాల అవసరం ఏమీ వుండదు కదా. ఈ తల్లిని తెల్లని పూవులతోను, శ్వేత వస్త్రాలతోను, శ్రీగంధముతోను అలంకరిస్తారు. పచ్చని వస్త్రాలను లేక తెల్లని వస్త్రాలను ధరించి తెల్లని పూలతో అర్చనాదులు చేసి క్షీరాన్నాన్ని, నేతితో కూడిన వంటలను, నారికేళము, అరటిపండ్లను చెరకును నివేదన చేస్తారు. ఆ తల్లి చల్లని చూపులలో అపార విజ్ఞాన రాశిని పొందవచ్చు.''వాగేశ్వరీ, మహాసరస్వతి, సిద్ధసరస్వతి, నీలసరస్వతి, ధారణ సరస్వతి, పరాసరస్వతి, బాలాసరస్వతి'' ఇలా అనేక నామాలున్నప్పటికీ ''సామాంపాతు సరస్వతీ'' అని పూజించే వారు ఆ తల్లికి ఎక్కువ ప్రేమపాత్రులట. మన తెలంగాణ రాష్ట్రంలో బాసర తో పాటు కాళేశ్వరం లో కొలువై ఉన్న సరస్వతి అమ్మవారి ఆలయంలో ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. వసంత పంచమి రోజు అమ్మవారికి అభిషేకం నిర్వహించి అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ తర్వాత ఆలయ ఆవరణలో అర్చకులు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

**- జిలుకర రవి కుమార్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** గత పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి సగం ఎంపీ సీట్లు బీజేపీకి అందించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విమర్శించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారి పెద్దపెద్ద హామీలు ఇచ్చే కేంద్ర మంత్రుల మాటలు నీటి మూటలైనని ఇది కేంద్ర బడ్జెట్ ద్వారా మరోసారి రుజువైందని మండిపడ్డారు. పేద వర్గాలను పూర్తిగా ఈ ప్రభుత్వం విస్మరించిందని, పేదల సంక్షేమానికి నిర్దిష్టమైన ఎలాంటి కార్యక్రమాలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి ఇక్కడి బీజేపీ ఎంపీలు ప్రశ్నించకపోవడం వల్లనే నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల తీవ్ర వివక్షత ప్రదర్శించారని దుయ్యబట్టారు.తెలంగాణ నుంచి 40000 కోట్ల జీఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ నిధులు దేనికి కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించి పసుపు బోర్డు తో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పథకాలకు నిధులు కేటాయించకపోవడం దౌర్భాగ్యం అన్నారు. బడ్జెట్ లో రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా

**- ఎస్ .వీరయ్య, రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక**



**విశ్వంభర, హైదరాబాదు:** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆదివారం హైదరాబాదు బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య తెలియజేశాడు. రూ.50,65,345 కోట్లతో 202526 కేంద్ర బడ్జెట్‌ను 01022025 న ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 2025 26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగే మహాధర్నా కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్ లో ప్రతిపాదించకపోవడం అన్యాయం అని అన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 10 సం॥ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించింది. రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపును విస్మరించింది. విద్యుత్‌రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనున్నది. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుందర్ మాట్లాడుతూ...బీమా రంగంలో ఎఫ్‌డీఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించింది. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం రూ.26,000ల డిమాండ్, స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025`26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుంది. ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత క్షీణింపజేస్తుంది. మధ్యతరగతికి రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించినా, పాత పద్ధతిలో ఎటువంటి మార్పులను ప్రస్తావించకపోవడం మధ్యతరగతి ప్రజలకు నష్టం. అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం. స్థూలంగా 10 సం॥ల బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 202526 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రం యావత్తూ తీవ్రంగా నిరసించాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరుతున్నది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ చేయాల్సిందే..

**- ఐఓబీ చీఫ్ మేనేజర్‌కు వినతి పత్రం అందించిన బీఆర్ఎస్**



**విశ్వంభర, ఇనుగుర్తి:** ప్రభుత్వ నిర్లక్ష్యమో, బ్యాంకు టెక్నికల్ ప్రాబ్లమో ఏదైతేనేం..రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని పీఏసీఎస్ ఛైర్మన్ దీకొండ వెంకన్న గౌడ్ అన్నారు. ఐఓబీ చీఫ్ మేనేజర్ సంతోష్ కుమార్ ఆదివారం సీనియర్ మేనేజర్ వేణుగోపాల్ తో కలిసి లోన్ రికవరీ క్యాంప్ కోసం స్థానిక బ్రాంచ్ కు ఆదివారం వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయనను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేసి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అర్హత ఉన్న చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని,మాఫీ కోసం రైతులకు సహకరించాలని చీఫ్ మేనేజర్ ను వెంకన్న గౌడ్ తో పాటు నాయకులు కోరారు. మాఫీ అయ్యేంతవరకు రైతుల పక్షాన ఉంటామని, వ్యవసాయ కార్పోరేషన్ దృష్టికి సైతం తీసుకువెళ్లి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కె రమేష్,బిఆర్ఎస్ గ్రామ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బేతమళ్ళ చంద్రయ్య,గండు నాగన్న దార్ల రామ్మూర్తి,జాటోత్ హరిచంద్, పింగిలి శ్రీను, మంగ్యానాయక్,దేవేందర్,నాగరాజు,సంతోష్ ఐఓబీ బిజినెస్ కరస్పాండెంట్ భూక్య వీరన్న పాల్గొన్నారు.

## నేటి నుంచి పోలీసు శాఖ క్రికెట్ టోర్నమెంట్

**- పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు క్రీడలు**




**విశ్వంభర, భూపాలపల్లి:** రేపటి నుంచి భూపాలపల్లి జిల్లాలోని వివిధ శాఖలతో క్రికెట్ టోర్నమెంట్ తో పాటు పోలీసు అధికారులు సిబ్బందికి పలు క్రీడలు నిర్వహించనున్నట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలు ఈ నెల 3 నుంచి 6 వరకు కొనసాగనున్నాయని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో రెవెన్యూ శాఖ, జెన్కో, జ్యుడిషరీ, సింగరేణి, మీడియా, ఎక్సైజ్, అటవీ శాఖ జట్లు పాల్గొననున్నాయని, ఈ క్రీడలు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంతో పాటు, కాకతీయ స్టేడియం లో జరగనున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి 10 ఈవెంట్స్ లలో క్రీడలు నిర్వహించనున్నామని, క్రికెట్, 100 మీటర్స్, 400 మీటర్స్, 4×400 రిలే, హై జంప్, లాంగ్ జంప్, టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్/ షట్టిల్, వాలీబాల్ తో పాటు పలు క్రీడలు నిర్వహించనున్నామని ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు.

## డాకు తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బిక్షపతి నాయక్

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** నారాయణపురం మండల పరిధిలోని డాకు తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా కరంటోత్ బిక్షపతి నాయక్, ఉపాధ్యక్షులుగా కే లోతు బాపూజీ, ప్రధాన కార్యదర్శిగా కే బాలకృష్ణ, సెక్రటరీ జనరల్ సెక్రెటరీ లుగా భజన్ నాయక్, మోత నాయక్, కోశాధికారి గోపాల్, కార్యవర్గ సభ్యులు శివ, రాజు, లాలు నాయక్ ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరెంటోతు బిక్షపతి నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటోతు శ్రీనివాస్ నాయక్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కృష్ణ నాయక్, మాజీ ఎంపీటీసీ బస్సీలాల్, దశరథ నాయక్, కేలోతు దూత, కేలోతు శ్రీను, భాస్కర్ నాయక్, శంకర్, నాయక్, రవి నాయక్, లాలు, వీరాలాల్, రవీందర్ నాయక్, చిన్న వినోదు పెద్ద వినోద్, తదితరులు పాల్గొన్నారు.



## వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఇటీవల ఉరి వేసుకుని చనిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద పరామర్శించారు. రాష్ట్రం లో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణం గా రియల్ ఎస్టేట్ వ్యాపారం లో నష్టం వచ్చి చనిపోతున్నాను అని సూసైడ్ నోట్ రాసి కొంపల్లి కి చెందిన వేణు గోపాల్ రెడ్డి. కొంపల్లి లోని మృతుడి ఇంటి వద్ద ఎమ్మెల్యే వివేకానంద్ తో కలిసి వేణు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పరామర్శించారు. కొంపల్లి రియాల్టర్ వేణు గోపాల్ రెడ్డి ఆత్మహత్య ఎంత గానో కలిచివేసిందని, వేణు గోపాల్ రెడ్డిది నిజానికి ఆత్మహత్య కాదు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని హరీష్ రావు అన్నారు. వేణు గోపాల్ రెడ్డి భార్య మాటలు వింటుంటే కన్నీళ్లు ఆగలేదన్నారు. యువ బిల్డర్ 39ఏళ్లకే చనిపోవడం, అది కూడా ప్రభుత్వం వల్ల సూసైడ్ చేసుకుంటున్న అని చెప్పి మరీ ఆత్మహత్య చేసుకున్నాడని, అతనికి ఐదేళ్ల పాప ఉందని తెలిపారు. చేనేత కార్మికులు ఆత్మహత్యలు, రైతులు ఆత్మహత్యలు, బిల్డర్లు ఆత్మహత్యలు, ఆటో డ్రైవర్ లు ఆత్మహత్యలు మొదటిసారిగా బిల్డర్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఇలా అన్ని వర్గాల వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి పేర్కొన్నారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి కి సోయి రావట్లేదు. హైడ్రా లాంటివి పెట్టి ప్రజల్లో భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో వారు కానీ, వేరే దేశం నుండి హైదారాబాద్ లో పెట్టు బడులు పెట్టేవారు కూడా బయంతో వెనక్కి వెళ్లిపోతున్నారు. పర్మిషన్ ఉన్న వాటిని కూడా హైడ్రా పేరుతో కూలగొట్టి కక్ష్య పూరితంగా వ్యవరిస్తున్న సీఎం,ఇప్పటికైనా ఈ ద్వేష రాజకీయాలు మానుకోవాలి గతంలో బీ అర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లలో పక్క దేశాలను ఆకర్శించుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన యడాది లోపే వచ్చిన అవకాశాలను వారి పిచ్చి పనులతో వెనక్కి పంపేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో బిల్డర్లు సైతం ఆత్మహత్య లకు పాల్పడుతున్నారంటే. వీరి పాలన స్థితి గతులు ప్రజలకు అందించే పాలన అలా ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చనిపోయిన వేణు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాల్సింది పోయి, ఇప్పటి వరకు కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించకపోవడం శోచనీయం. మున్సిపల్ మంత్రి మీరే, ముఖ్యమంత్రి మీరే. ఈ ఆత్మహత్య లకు కారణం కూడా మీరే సీ యం రేవంత్ రెడ్డి. బిల్డర్స్ అసోసియేషన్ లు చనిపోయిన వేణు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. బీ అర్ ఎస్ పార్టీ తరుపున వేణు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం.వారి కుటుంబానికి అండగా ఉంటాం అని మాజీ మంత్రి హరీష్ రావు హామీ ఇచ్చారు.

## ఆకట్టుకున్న రూహాని కూచిపూడి అకాడమి చిన్నారులు




**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు వారి సంస్కృతిలో కూచిపూడి నృత్యానికి అత్యంత ప్రజాదరణ ఉందని, అంతరించిపోతున్న ఈ నృత్యకళను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. నగరంలోని బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో మేరా భారత్ మహాన్, నాలుగవ సీజన్ లో భాగంగా హైదర్ నగర్ డివిజన్ ఆదిత్య నగర్ లోని రుహాని కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుహాని కూచిపూడి నృత్య అకాడమీ లోని చిన్నారులందరు తమ అద్భుతమైన నృత్య ప్రదర్శన ప్రదర్శించారని కొనియాడారు. చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిందనడంలో సందేహం లేదన్నారు. చిన్న వయసులోనే ఆ చిన్నారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకోవడంతో పాటు కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు అందించడానికి తమ వంతు కృషి చేయాలనే సంకల్పం కలుగుతుందనడంలో సందేహమే లేదన్నారు. చిన్న వయసులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఆయన ఆశీర్వదించారు. తెలుగు కళలను భావితరాలకు అందించడానికి కృషి చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలో బిందు మాధవి భావన, నీలా, లిఖిత, రిధి అనే చిన్నారులు తమ కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. కార్యక్రమంలో నిర్వాకులు సిరాజ్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం




**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఉపాధి కల్పనకై నిధులు కేటాయించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కోట రమేష్,అనగంటి వెంకటేష్ లు అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) హైద్రాబాద్ సెంట్రల్ సీటీ కమిటీ అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా, యువజన వ్యతిరేక బడ్జెట్ కు నిరసనగా హైదరబాద్ బాగ్ లింగంపల్లి లో కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ యువజన, విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఈ బడ్జెట్ ను పెట్టారని కార్పోరేట్లకు రాయితీలు ఇస్తూ పేదప్రజలపై భారాలు మోపే విధంగా తీర్చిదిద్దారని అన్నారు. ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించలేదని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలు లేవని,మోదీ ప్రభుత్వ గత పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదని అన్నారు. చిన్న మధ్య తరహ పరిశ్రమలను ప్రొత్సహిస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాయితీలును ప్రకటించలేదు. మొత్తం బడ్జెట్ లో నిరుద్యోగం అనే పదాన్నే ప్రస్తావించకపోవడం దేశంలో యువతను విస్మరించిందని అన్నారు. దేశంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్ లో ఎక్కువ నిధులు కేటాయించి మిగతా రాష్ట్రాలకు మొండి చేయి చూపిందన్నారు. రాష్ట్ర విభజనలో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చకుండా నిధులు కేటాయించకుండా రాష్ట్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రం నుండి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి నిధులు రాబట్టంలో పూర్తిగా విఫలం చెందారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను సవరించి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దామెర్ల హాష్మీబాబు, ఎండి జావిద్, జిల్లా నాయకులు క్రాంతి, రాజయ్య, దేవేందర్, జావిద్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో వసంత పంచమి వేడుకలు




**విశ్వంభర, కాళేశ్వరం:** త్రిలింగ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి అనుబంధాలయమైన మహా సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా ఉదయం 9 గంటల 30 నిముషాలకు సామూహిక అక్షర శ్రీకార మహోత్సవం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించబడునని ఆలయ కార్య నిర్వహణ అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మంగళవారం రథసప్తమి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి యొక్క ఆలయంలో ఉదయం 10.00 గంటలకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించబడునని భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా ఆయన కోరారు.

## ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా ఇరుకుల శ్రీనివాస్



**విశ్వంభర, దేవరుప్పల:** జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు డాక్టర్ గంగ శెట్టి ప్రమోద్ కుమార్ ఆదేశానుసారం ఆదివారం దేవరుప్పల మండల అధ్యక్ష పదవికి నామినేషన్లు వేయడం జరిగింది. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి ఇరుకుల శ్రీనివాస్ ఒకే ఒక నామినేషన్ వేయడం జరిగింది. దాన్ని ధృవీకరిస్తూ అధ్యక్ష పదవికి ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారి డాక్టర్ మదంశెట్టి వరూధిని, పర్యవేక్షకులు గన్ను నరసింహులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా విభాగం కార్యదర్శి గంగిశెట్టి అనూజ, ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు, రీజన్ చైర్మన్ పడకండి రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గజ్జి సంతోష్ కుమార్, వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్ల సోమయ్య, జోన్ చైర్మన్ మా శెట్టి వేణుగోపాల్, తక్షణ పూర్వ అధ్యక్షుడు బుక్కరామయ్య, వనమాల సోమలింగం, బెలిదే నరసయ్య, గజ్జి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అడ్వంట సీడ్స్ కంపెనీ వారి మిర్చి పంట క్షేత్ర ప్రదర్శన




**విశ్వంభర, పలిమల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమల మండల కేంద్రంలోని పంకెన గ్రామంలో రైతు దుర్గం బాణయ్య మిరప తోటలో ఆదివారం అద్వంట సీడ్స్ గోల్డెన్ వండర్ రకం మిర్చి పంట పైన క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. సుమారు 160 మంది రైతులు తిలకించారు. ప్రస్తుత వాతవరణాన్ని చీడ పీడలు తట్టుకొని పంట ఏపుగా పెరిగి మంచి కాపు వచ్చిందని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కంపెనీ మేనేజర్ మనోజ్ చౌదరి మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని అదిక దిగుబడి పొందడానికి సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు తదుకల మహేష్, వీరాస్వామి, రాజు, కంపనీ ప్రతినిది తోట సమ్మయ్య మరియు చుట్టు పక్క గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## హృదిస్వప్నం పుస్తకావిష్కరణ సభ




**విశ్వంభర, హైదరాబాద్:** ఈనెల 4 మంగళవారం సాయంత్రం 5 గంటలకు త్యాగరాయ గాన సభ హైదరాబాద్ లో కందాళ పద్మావతి రచించిన "హృదిస్వప్నం" పుస్తకావిష్కరణ కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు డా. నాలేశ్వరం శంకరం, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసర్చ్ ఫోరం సభ్యులు డా.చిటికెన కిరణ్ కుమార్, ప్రముఖ కవయిత్రి వురిమల్ల సునంద లు విచ్చేయుచున్న సందర్భంగా సాహితీ మిత్రులందరికి వేల్పుల నరసింహాచార్యులు ఆహ్వానం పలికారు.

## భక్తి శ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం




**విశ్వంభర, ఎల్బీనగర్:** కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పూజలు వేద పండితులు ఘనంగా నిర్వహించగా వైశ్యులు భక్తి శ్రద్ధలతో పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్కేపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి హోమం, అభిషేకం, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ రాదా ధీరజ్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సురేష్, ఛైర్మన్ తాడేపల్లి వెంకటేశం, వైస్ ఛైర్మన్ శుభాకర్, అధ్యక్షుడు ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నాగేంద్రయ్య లు హాజరు అయ్యారు. ఆర్యవైశ్యుల కులదేవత వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆర్యవైశ్య సంగం అధ్యక్షులు ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్త అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, శ్యామ్, వేణు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ పాల్గొన్నారు.

# ఏఐఎఫ్‌టీయూ(ఎన్) రాష్ట్ర కార్మిక సదస్సు




**విశ్వంభర, హైదరాబాద్:** అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ )(ఏ.ఐ.ఎఫ్.టీ.యూఎన్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక సదస్సు ఏ.ఐ.ఎఫ్.టీ.యూ(ఎన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోదం మల్లేశం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్త జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నటువంటి అన్ని రకాల ఉత్పత్తులను చేసేది కార్మిక వర్గం మాత్రమే, ఆ ఉత్పత్తి కార్మిక వర్గ శ్రమ ద్వారానే జరుగుతుంది. స్వతంత్రం వచ్చి యేళ్లు గడుస్తున్న ఆ రోజు నుండి ఈరోజు వరకు ఎలాంటి మార్పు రాలేదు. ఆరోజు స్వతంత్రం కోసం ఏ ఆకాంక్ష తో పాల్గొని ప్రాణాలు వదిలారో, తెలంగాణ సాయుధ పోరాటం సైతం పోరాటాలు జరిగాయి. వాటి స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితులలో అదేవిధంగా ఐక్య ఉద్యమాలు చాలా అవసరం అని, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ ప్రకటనలో పేద ప్రజలకు జీఎస్టీ తో కొంత ఉపశమనం జరిగిందని చెప్తున్నటువంటి మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాల మీద వివక్షత విపరీతంగా పెరిగిపోయింది. దేశంలోని పరాధీన పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్డీఏ పాలకులు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని చెప్పారు. ఉన్న ఉద్యోగాలను కూడా పీకుతున్నారు. అవినీతికర పాలకులు పాలకవర్గాలు విదేశాలలో దాచుకున్న నల్లధనాన్ని తీసుకుని వచ్చి ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలను జమ చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా వెనక్కి తీసుకురాకుండా ఉండిపోయారు. బడా బడా పారిశ్రామికవేత్తల కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలను రద్దుచేసి ప్రజల పైన అదనపన్నులు విధించి ఆ పన్నుల రాబడితో రద్దు చేసిన బ్యాంకు రుణాల లోటును పూడుస్తున్నారు. కార్మికుల పైన శ్రమ భారాన్ని పెంచుతూ కార్మిక వర్గానికి గతంలో ఉన్న ప్రయోజనాలను అన్నింటిని రద్దు చేస్తూ ఉన్నారు. నాలుగు లేబర్ కోడుల పేరుతో మధ్యయుగాల వేతన బానిసత్వపు పోకడలకు దిగారు ఎనిమిది గంటల పని దినాన్ని గల్లంతు చేశారు. కనుకనే రైతాంగంలో 92 శాతం రుణభారం కింద నలిగిపోతున్నారు. 75 సంవత్సరాల పండుగ అంటూ పాలకులు భాజా భజంత్రీలు మోగిస్తూ ఉండగా నిరుద్యోగుల ఆర్తనాదాలు దేశమంతట మారుమోగుతున్నాయి. ఎన్నడు లేనంత స్థాయిలో నిరుద్యోగం ఈ సమాజాన్ని అలముకున్నది. మోదీ పాలనలో ఉద్యోగ కార్మిక వర్గాలు, సేవారంగం మౌలిక సదుపాయాల రంగం స్కీం కార్మికులు, బీడీ కార్మికులు, తునికా కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, ఎగుమతి దిగుమతి రంగా హమాలీ కార్మికులు, గ్యాస్ ట్రాన్స్పోర్ట్ బొగ్గు గనుల కార్మికులు, మత్స్య కార్మికులు, వీధి విక్రయదారులు, ఇంటి పనివారలు, వ్యవసాయ కార్మికులు, బ్యాంకు ఇన్సూరెన్స్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రక్షణ రంగం టెలికం రంగం పోస్టల్ ఉద్యోగులు, ఎలక్ట్రికల్ పోర్ట్ డాక్టర్ కార్మికులు, ఇటుక బట్టి కార్మికులు, షాపు వర్కర్స్ చేనేత కార్మికులు, తదితర అసంఘటిత కార్మికలు తమ జీవితాల్లో తీవ్ర కల్లోలన్నీ ఎదుర్కొంటున్నారు. నిత్య జీవిత అవసరాల ధరలు పెరిగిపోయాయి జీవన పరిస్థితిలో దిగజారిపోయాయి. కార్మికులమైన మనం పరుచుకుంటున్న పాసీదానికి వ్యతిరేకంగా ముందు భాగాన నిలబడి పోరాడుదాం అని కార్మిక వర్గానికి పిలుపునివ్వడం జరిగినది. ఇంకా ఈ సదస్సును ఉద్దేశించి కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీ వినాయక రెడ్డి ఏఐఎఫ్టీయూ న్యూ అధ్యక్షులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ , ఏఐకేఎంకేఎస్ నాయకులు కామ్రేడ్ ప్రసాద్ అన్న, ఏఐఎఫ్టీయూ న్యూ కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ గణేష్ పండా, జే కిషోర్ బాబు, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేమిడి ఉప్పలయ్య, మరియు కళాకారులు ఇరెల్లి రామచందర్ కళ్లెపు ప్రసాద్ రుద్రారపు ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రితో సామాజిక న్యాయం, విద్యపై కీలక చర్చ



**విశ్వంభర, ఆమనగల్లు:** టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. లక్ష్మి నివాస్, కేంద్ర సహాయ మంత్రి రాందాస్ ఆత్వాలేను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల హక్కులు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలపై వివరణాత్మక చర్చ జరిపారు. ఎస్సీ హాస్టళ్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి, పేద, వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం, సాధికారిత కోసం మరిన్ని కేంద్ర పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత అంశాలపై భేటీలో చర్చించారు. ఈ సమావేశంలో టీఎస్ఎస్ఓ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ ఆత్వాలే ఈ విషయాలను ప్రభుత్వ ముందు ఉంచుతానని హామీ ఇచ్చారు. ఈ భేటీ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యలు ప్రభుత్వ స్థాయిలో చర్చకు వచ్చే అవకాశం లభించిందని ఎం. లక్ష్మి నివాస్ అభిప్రాయపడ్డారు.

## పేటలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయం ఆలయానికి ఆదివారం సాయంత్రం ఘనంగా మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం, తదితర సామాగ్రిని సమర్పించారు. అమ్మవారికి ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాలనీవాసులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేట మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పెద్ద శంకరంపేట లో ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులుగా బుగుడాల సాయిలు పటేల్, ఉపాధ్యక్షులుగా గంగన్న గారి సుభాష్ పటేల్, కార్యదర్శిగా రాధాకృష్ణ పటేల్, కోశాధికారిగా రాయిని రాములు పటేల్, సంయుక్త కార్యదర్శిగా ఎల్లయ్య, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల మున్నూరు కాపు సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు జ్ఞాన సరస్వతి ఆలయానికి ఎమ్మెల్యే రాక

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నం. 1 లో గల జ్ఞాన సరస్వతి దేవాలయ స్థాపించి పుష్కరకాలం అయినా సందర్భంగా దేవాలయంలో కాలనీ అసోసియేషన్, దేవాలయ కమిటీ సముక్తంగా నిర్వహించే పుష్కర కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి సోమవారం హాజరవుతున్నట్లు మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమ కారులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.


## బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాజీ ఎమ్మెల్యే




**విశ్వంభర, దోమ:** దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సత్తయ్య తల్లి మరణించడంతో ఆదివారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అశోక్ కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేందర్, పరిగి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ భాస్కర్, నాయకులు హనుమంత్ రెడ్డి, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో తెలుగుదేశం నాయకులు

**విశ్వంభర, రామన్నపేట:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన రాపోలు నరసింహ అన్న కుమారుని వివాహ వేడుకల్లో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సత్తిరెడ్డి రెడ్డి, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకులు నకిరేకంటి గణేష్, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ప్రజలు మీర్జా ఫజల్ బేగ్, బత్తుల సత్యం, పోచబోయిన మల్లేష్, తెలుగుదేశం పార్టీ గ్రామా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పేదలను ముంచి పెద్దలను పెంచే కేంద్ర బడ్జెట్

* వ్యవసాయ రంగాన్ని, ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర



**విశ్వంభర, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చే విధంగా లేదని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య అన్నారు. స్థానిక సుభాష్ సెంటర్లో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే 50 లక్షల కోట్ల బడ్జెట్ అని చెప్పుకున్న దేశంలో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకేసే విధంగా ఉందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది బీజేపీ ఎంపీలు ఉన్నా, ఫలితం మాత్రం శూన్యం అన్నారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీకి, విద్యా రంగానికి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. బీహార్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందున వరాల జల్లు కురిపించి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్ర పన్నుతుందన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేవలం 2.1 మాత్రమే కేటాయించి బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించడం పక్షపాత ధోరణి అన్నారు. నాగపూర్ ఆర్ఎస్ఎస్ కార్యాలయ కనుసనల్లో జరిగిన బడ్జెట్లో దేశానికి ఇరుసు లాంటి వ్యవసాయ రంగానికి కనీస మద్దతు ధర ప్రస్తావన లేదన్నారు. ఎరువులు, పురుగు మందులకు సబ్సిడీలో కోతలు విధించింది. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. వంతుగా బడ్జెట్ పెట్టారు తప్ప దేశంలో, రాష్ట్రంలో సామాన్యుల బ్రతుకును మార్చే విధంగా బడ్జెట్ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, గాదె నరేందర్, పట్టణ శాఖా కార్యదర్శి మునికుంట్ల లెనిన్, నాయకులు బావండ్లపల్లి సత్యం, జనపాల లక్ష్మణ్, పల్లె సత్యనారాయణ, కడారి రాములు, కుందూరు వెంకటేశం, గంజి అశోక్, రసాల రమేష్, తరిగొప్పుల వెంకటరెడ్డి, బకీరు చెన్నయ్య, గాదె ఎల్లయ్య, దోమల పల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్

* ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి బి.బి.ఆర్ వేణు



**విశ్వంభర, ఎల్బీనగర్:** దేశ గతి నే మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ బి.బి.ఆర్ వేణు అన్నారు. ఆదివారం ఆర్కే పురంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మక నిర్ణయమని అన్నారు. తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ.85 వేల వరకు ఆదా అవుతుంది అని తెలిపారు. రాష్ట్రంలో 50 లక్షల మందికిపైగా రైతులకు లక్ష రుణం పొందే అవకాశం ఉందని కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే టీవీ, మొబైల్స్, లెదర్ ఉత్పత్తులు ధరలను భారీగా తగ్గబోతున్నాయని, ఎలక్ట్రిక్ వాహనాలపై ధరలు కూడా తగ్గబోతున్నాయని అని జాతీయ పత్తి కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో తెలంగాణలో పత్తి, పప్పు దినుసులు పండిస్తున్న రైతులకు అధిక ప్రయోజనాలు కలిగే అవకాశం రావడంతో గిట్టుబాటు ధర పెరిగే అవకాశము ఉంది అన్నారు. ఇంత గొప్ప బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల పక్షపాతి అనడానికి నిదర్శనం ఈ బడ్జెట్ అన్నారు. తెలంగాణ దేశంలో లక్ష రూపాయల లోపు జీతభత్యాలు పొందే ఉద్యోగులంతా ఇకపై పన్ను కట్టాల్సిన అవసరం లేక పోవడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా గీతాసెల్ స్టేట్ కో కన్వీనర్ రాగుల కిరణ్ కుమార్ గౌడ్ , ఆర్కే పురం డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముంత రాములు యాదవ్, ఓబీసీ నాయకులు రమేష్ గౌడ్, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

- దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణ పట్ల వివక్షకు నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలు దేరి వెళ్ళారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో తెలంగాణ పట్ల వివక్షత కనిపించిందని అని అన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నారని, అయినా నిధులు తేవడంలో పూర్తిగా విఫలం అయ్యారని రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదు అని అన్నారు. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నరసింహ, వెంకటేష్ గౌడ్, రాజు నాయక్, మస్న రవి, లాజర్, చేపంగి ప్రవీణ్, యూసుఫ్ ఖాద్రి ఢిల్లీ, శ్రీధర్, శివ,వంశి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దిష్టి గంపల క్రతువు ప్రారంభం

**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని చిన్న ముప్పారం లో ఈనెల 13న యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల బోనాలు జాతర పురస్కరించుకొని గ్రామంలో దిష్టి గంపల క్రతువు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు గొల్ల మార్గం నర్సయ్య ఇంటి నుంచి పూజారి గల్ల నర్ర ముత్తయ్య యాదవ పెద్దలు, కులస్తులు కుల యువకులు దిష్టి గంపలను అత్యంత భక్తి శ్రద్ధలతో లింగమంతుల ఆలయానికి తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజులపాటు పూజాది క్రతువులు నిర్వహించి అనంతరం స్వామి వారి జాతర నిర్వహిస్తారు. కార్యక్రమంలో గొల్ల కులస్తులు పాల్గొన్నారు.





## వన దుర్గ భవాని మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మెదక్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గ భవాని మాతను ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పొట్టోళ్ల సంజీవరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ ఎంపీపీ జీవుల నాయక్ రామ్ రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

## అలివేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఈనెల 03, నుండి 07 వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం మరియు రథసప్తమి కార్యక్రమాలు, 4వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ మరియు క్రికెట్ టోర్నమెంట్ కూడా నిర్వహిస్తున్నామని మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం తెలిపారు. గ్రామ యువకులు, పెద్దలు అందరితో పాటు మండల ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు కూడా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## న్యూఢిల్లీలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా మల్లురవి ప్రచారం



**విశ్వంభర, కల్వకుర్తి:** న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సందీప్ దీక్షిత్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మరియు ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించిన పోలీసులకు ఎస్పీ అభినందన

**విశ్వంభర, భూపాలపల్లి:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో భూపాలపల్లి జిల్లా పోలీసులు సీసీఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఆర్ పోలీసు కానిస్టేబుళ్లు శశిధర్, రమీజ్ హుస్సేన్ బాస్కెట్ బాల్ ఈవెంట్లో కాంస్య పతకాన్ని గెలుచుకోగా, ఆదివారం ఎస్పీ కిరణ్ ఖరే విజేతలని అభినందించారు.



## ఎన్నికలు దృష్ట్యా ప్రజావాణి రద్దు


*** కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఫిబ్రవరి 3 సోమవారం భూపాలపల్లి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

## మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం రావడం పట్ల హర్షం

**- శుభాకాంక్షలు తెలిపిన మేడి రమేష్ దంపతులు**



**విశ్వంభర, రామన్నపేట:** సామాజిక ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగను పద్మశ్రీ పురస్కారం వరించడం పట్ల యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన మేడి రమేష్ ప్రియదర్శిని దంపతులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ పోటీలో విద్యార్థులు ప్రతిభ




**విశ్వంభర, దేవరుప్పుల:** హైదరాబాద్ పీఎన్ఎం హై స్కూల్ , కూకట్ పల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి యామ శివ, 4వ తరగతి యామ ఆంజనేయులుకి ప్రతిభ పురస్కారం అందించడం జరిగింది.

## కరీంనగర్‌లో దారుణ హత్య



**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ పరిధిలోని బొమ్మకల్ సమీపంలో బెజ్జంకి మహేష్ అనే యువకుడు దారుణ హత్య కు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్



**విశ్వంభర, బషీర్ బాగ్:** నూతన వధూవరులు లక్ష్మి, కిరణ్ వివాహానికి టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహానికి వెంకట్, మహేష్ గౌడ్, సాయి బాలాపూర్ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక సమావేశాన్ని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో సర్వసభ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మునుగోడు నియోజకవర్గం కన్వీనర్ మహేశ్వరం కృష్ణయ్య అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా ఈసం సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కట్టగాలిబ్ ని ఎన్నుకున్నారు. అనంతరం ఉపాధ్యక్షులుగా ఈద శంకరయ్య, మహేశ్వరం స్వామి, గుండమల్ల మల్లేష్, ఈసం యాదయ్య, రమేష్, మంచాల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా కురిమిద్దే గోపాల్, మంచాల రాములు, గుండమల్ల కృష్ణ, కోశాధికారిగా మంచాల నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేశ్వరం విఘ్నేశ్వర్, ఈసం సత్యనారాయణ, సరిపెల్లి సత్యనారాయణ, గుండమల్ల బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఈసం యాదయ్య, కొలను మల్లేష్, వెంకటేష్, సైదులు, జంగయ్య, యాదయ్య, శ్రీను, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల మహానాడు పోరాటానికి ఏబిసిడి వర్గీకరణ వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిద్దామని మాల మహానాడు ఉపకులాల ఐక్యత వర్ధిల్లాలని పేర్కొన్నారు.



# తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష..

**తేల్చి చెప్పిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**విశ్వంభర, శంకర్‌పల్లి:** తెలంగాణకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడి అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామానికి చెందిన బీజేపీ నేత గౌడిచర్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకు ముందు బోనాలు, కోలాటాలు, డప్పుల దరువులు, బాణసంచా మోతలతో సబితారెడ్డికి ఘన స్వాగతం పలికారు. భారీ క్రేన్‌తో స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి భారీ పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. ఎగిరేది గులాబీ జెండాయేనని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రేవంత్ సర్కార్ ప్రజలకు ఏం చేస్తారో చెప్పడం లేదన్నారు. ప్రజలు ఇప్పటి వరకు మూడు సార్లు దరఖాస్తులు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం పొందలేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గ్రామాల్లో రుణ మాఫీ ఇంకా జరుగలేదని కేసీఆర్ హయాంలో అటు చినుకులు పడితే ఇటు రైతుల ఖాతాల్లో డబ్బులు పడేవని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నాడు కేసీఆర్ ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా నేడు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందుతున్నదన్నారు. 24 గంటల విద్యుత్, రోడ్లు, గురుకులాలు, పాఠశాల భవనాలు, సమీకృల కలెక్టర్ భవనాలు నిర్మించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## భరతముని జయంతి ఉత్సవాల సందర్భంగా పేరిణి నృత్యోత్సవం

* తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ కొరకు 216 చిన్నారి కళాకారులతో ప్రదర్శన

* తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం



**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం లోని మినీ స్టేడియంలో భరతముని జయంతి ఉత్సవాల సందర్భంగా పేరని నృత్యోత్సవం తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ కొరకు, మీనాక్షి కళానిలయం వారు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొమిరెడ్డి కరంచంద్ న్యాయవాది మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్, రికార్డ్ స్ జ్యూరీ మెంబర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతిని దశదిశల చాటుతుందని లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నాన్స్ ఉంటాయని దానికి అనుగుణంగా జ్యూరీ మెంబర్స్ నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పేరని నృత్యాన్ని భరతముని జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రపంచానికి తెలియజేయడం ఆనందాన్ని కలిగిస్తుందని మీనాక్షి కాలనీలయం వ్యవస్థాపకురాలు శ్రీవాణి అన్నారు. ఇట్టి కార్యక్రమంలో పాలుపంచుకున్న చిన్నారుల తల్లిదండ్రు లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు సర్టిఫికెట్లు అందజేశారు.



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

*** తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** బడ్జెట్ లో మరోసారి తెలంగాణకు గాడిద గుడ్డు మిగిలిందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. తెలుగింటి కోడలైన నిర్మలమ్మకు తెలంగాణపై ప్రేమ లేకపోవడం బాధాకరమని అన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్ , కిషన్ రెడ్డి తల ఎక్కడ పెట్టుకోవాలో అర్థమవుతుందా అని పటేల్ రమేశ్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పై వివక్ష చూపి రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం తెలంగాణకు నయాపైసా కేటాయించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టం హామీలు, మెట్రో రెండో దశకు నిధుల కేటాయింపు తో పాటు ఇతర వాటికి కేటాయింపులు శూన్యమన్నారు. తెలంగాణ నుంచి 40 వేల కోట్ల జీఎస్టీ రూపంలో కేంద్రానికి వెళ్తుంటే నిధులు కేటాయించకోవడం దుర్మార్గమని అన్నారు. పనికట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేసే బీజేపీ సన్నాసులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి ప్రశ్నించారు.



## బాసర అమ్మవారికి చేనేత పట్టు వస్త్రాలు సమర్పణ




**విశ్వంభర, బాసర :** అఖిల భారత పద్మశాలి నిత్యాన్న సత్రం బాసర వారి ఆధ్వర్యంలో చేనేత కళాకారుల చేత నేసినటువంటి చీరలను వసంత పంచమి వేడుకలు సందర్భంగా నిత్యాన్న సత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్ సమక్షంలో ఆలయ అర్చకులకు పెద్ద ఎత్తున మహిళలతో ఊరేగింపుగా వెళ్లి అందజేశారు. వసంత పంచమి వేడుకల సందర్భంగా చేనేత కళాకారులు అమ్మవారికి పట్టు వస్త్రాలను నేసి అందించడం మహోత్కర కార్యానికి పూనుకుంది. ఈ పట్టు వస్త్రాలను వసంత పంచమి రోజున సరస్వతి అమ్మవారికి దేవాలయ అర్చకులు, అధికారులు శాస్త్రోత్రకంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరిస్తారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి నిత్య అన్న సత్రం శ్రీశైలం అధ్యక్షుడు వర్కాల సూర్యనారాయణ, తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్, గ్రేటర్ పద్మశాలి మహిళా విభాగం అధ్యక్షురాలు పోరండ్ల శారద, తెలంగాణ ప్రాంత పద్మశాలి హైదరాబాద్ విభాగం మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డి గూడెం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద పది లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణము చేపట్టడం జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లు నిర్మాణమునకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనులను చేపట్టడం ఆశించేదగ్గ విషయమని ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నాలుగు సంక్షేమ పథకాలను ప్రజలకు రైతాంగానికి అందించడానికి కృషి జరుగుతున్నదని ఇట్టి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమములో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కరంటోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, డీసీసీ కార్యదర్శులు నోముల మాధవరెడ్డి, ఏపూరి సతీష్, మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ పానుగోతు బాలు నాయక్, సీనియర్ నాయకులు జినుకల మారయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి ఐలయ్య, సీనియర్ నాయకులు కర్తల సాయిలు, వీరమల్ల స్వామి గౌడ్, చలమల నరసింహారెడ్డి, ఐతరాజు రాములు, సిరి పంగి మార్కండేయులు, పందుల లింగస్వామి, పందుల మహేష్, కొంపెల్లి నాగరాజు, దోద అంజిరెడ్డి, ఐతరాజు శ్రవణ్, సిరిపంగి రమేష్, సుమత, పంతంగి లింగస్వామి, కుమార్, సిరిపంగి మినయ్య, ఏర్పుల లింగస్వామి, నర్రి నరేష్, సిరిపంగి గోపాల్, కుర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాయి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా లక్ష్మణ చారి



**విశ్వంభర, ఎల్బీనగర్:** చైతన్యపురి డివిజన్ సాయి నగర్ సంక్షేమ సంఘంలో జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా లక్ష్మణ చారి, జనరల్ సెక్రటరీ కొండోజు వేణుగోపాల్ చారీ, జాయింట్ సెక్రెటరీ భూకీయ్య లక్ష్మి లు విజయం సాధించినారు. కోశాధికారి గుప్తా ,వైస్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమా నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి , వాసుదేవ్ , పరంధాములు , అరుణ్ అంబేద్కర్, చైతన్యపురి డివిజన్ ప్రెసిడెంట్ బండ సురేందర్ రెడ్డి , సాయి నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మానవతా పరిమళాలు విరబూసిన కవన కుసుమాలు పుస్తకావిష్కరణ

**విశ్వంభర, బషీర్ బాగ్:** కుటుంబ వ్యవస్థ విలువలు, మానవ సంబంధాల మాధుర్యాలను పునస్మరిస్తూ కవితా కుసుమాలతో కూర్చిన కవితా సంపుటి కవన కుసుమాలని ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం గుండవరపు హనుమంతరావు కళావేదిక, భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సభకు హాజరై డాక్టర్ అన్నమరాజు సుమాల్య రచించిన కవన కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి ఆరాధన, సామాజిక విలువలతో కూడిన కవితలతో రచించిన కవన కుసుమాలు అలతి పదాలతో కూడి చక్కని భావుకతతో పాఠకులను ఆకట్టుకుంటాయని అన్నారు. పండిత వంశాన్ని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న అన్నమరాజు సుమాల్య చక్కని కవిత్వం అందించారని అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన పద్యభాషి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ సుమాల్య కవిత్వం సరళమై, సుబోధకమే అందరి హృదయాలను అలరిస్తుందని తెలిపారు . ప్రముఖ కవి చౌడూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చౌడూరి నరసింహారావు కవన కుసుమాలు పుస్తకాన్ని సమీక్షించగా కవి, రచయిత లోడె రాములు వేదిక పైకి అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గంప ఉమాపతి ఆధ్వర్యంలో చౌడూరి నరసింహారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించి కవితలను ఆలపించిన కవులను సర్టిఫికెట్, శాలువా మెమొంటోలతో ఈసందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు సాహిత్య అభిమానులు పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






అరసవల్లిలో రథసప్తమి వేడుకలు..

## ఉత్సాహంగా సూర్యనమస్కారాలు

**విశ్వంభర, అరసవల్లి:** శ్రీకాకుళంలోని అరసవల్లి సూర్యదేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉదయం సామూహిక సూర్యనమస్కారాలతో ప్రారంభమైన ఈ వేడుకలకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు హాజరయ్యారు. సుమారు 4వేల మంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా సూర్యదేవాలయం వద్ద రద్దీ నెలకొంది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డచ్ భవనం వద్ద హెలికాప్టర్ రైడ్ ఏర్పాటు చేశారు. నిర్దేశిత రుసుంపై 8 నిమిషాలపాటు హెలికాప్టర్‌లో తిరిగే అవకాశం కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ సేవలను అందుబాటులో ఉంచారు. హెలికాప్టర్ రైడ్ కోసం పెద్ద ఎత్తున యువత తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. హెలికాప్టర్ రైడ్, ఇతర ఏర్పాట్లను రామ్మోహన్‌నాయుడు పరిశీలించారు. సాయంత్రం లేజర్ షోతో పాటు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## భర్త కిడ్నీ ₹10లక్షలకు అమ్మించి.. ఆ డబ్బు తీసుకొని ప్రియుడితో పరార్!



**కోల్‌కతా:** మాయమాటలు చెప్పి ఓ మహిళ తన భర్త కిడ్నీ అమ్మించి.. ఆ డబ్బుతో ప్రియుడితో వెళ్లిపోయిన ఘటన పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా జిల్లాకు చెందిన మహిళ తమ కుమార్తె చదువు, వివాహానికి కావాల్సిన డబ్బు కోసం కిడ్నీ అమ్మాలని తన భర్తను ఒత్తిడి చేసింది. అలా చేస్తే తమ కుటుంబానికి ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని నమ్మించింది. భార్య పట్టుబట్టడంతో చేసేదేమీ లేక భర్త తన కిడ్నీని రూ.10 లక్షలకు విక్రయించాడు. దీంతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించాడు. అయితే, అతడి భార్య మాత్రం రూ.10 లక్షలు తీసుకొని ఫేస్‌బుక్‌లో పరిచయమైన రవిదాస్ అనే వ్యక్తితో పరారయ్యింది. ఆమె మోసాన్ని తెలుసుకున్న భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సహాయంతో వారు ఉన్న ప్రాంతానికి వెళ్లగా ఆమె తన భర్తతో మాట్లాడడానికి నిరాకరించింది. విడాకులు ఇస్తానని హెచ్చరించింది. తన భార్య మాటలు నమ్మి మోసపోయానని, ఎలాగైనా తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను వేడుకున్నాడు.

### పార్లమెంటులో
## ‘రామాయణం ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ’..




**ఢిల్లీ:** పార్లమెంట్ అరుదైన సందర్భానికి వేదిక కానుంది. ఈ నెల 15న ‘రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ’ సినిమాను పార్లమెంటులో ప్రదర్శించనున్నారు. గీక్ పిక్చర్స్ ఇండియా ఈ విషయాన్ని వెల్లడించింది. ‘రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ చిత్రాన్ని ఫిబ్రవరి 15న పార్లమెంటులో ప్రదర్శించనున్నాం. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటు సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు సైతం దీనికి హాజరుకానున్నారు. ఇది మాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది’ అని గీక్ పిక్చర్స్ ఇండియా సహ వ్యవస్థాపకులు అర్జున్ అగర్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. 1993లో ‘రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ’ యానిమేటెడ్ చిత్రాన్ని రూపొందించారు. 24వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో దీన్ని ప్రదర్శించారు. అయితే కొన్ని కారణాల వల్ల అప్పుడు థియేటర్‌లలో ప్రదర్శించలేకపోయారు. 2000 సంవత్సరంలో టీవీలో దీన్ని టెలికాస్ట్ చేయగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. దీంతో దీని 4కే వెర్షన్‌ను సిద్ధం చేసి జనవరి 10న రిలీజ్ చేశారు. గీక్ పిక్చర్స్ఇండియా, ఏఏ ఫిల్మ్స్ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. రామ్ మోహన్, యుగో సాకో దర్శకత్వం వహించిన ఈ యానిమేటెడ్ చిత్రానికి విజయేంద్రప్రసాద్ రైటర్‌గా వర్క్ చేశారు.

## కుంభమేళాకు క్రిస్ మార్టిన్..

### పుణ్య స్నానమాచరించిన కోల్డ్‌ప్లే సింగర్



ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి కోల్డ్‌ప్లే సింగర్ క్రిస్ మార్టిన్ హాజరయ్యారు. అతడితో పాటు అతడి స్నేహితురాలు డకోటా జాన్సన్ కూడా వచ్చారు. వీరిద్దరూ త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. క్రిస్ మార్టిన్ భారత్‌లో వరుసగా కాన్సర్ట్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల ముంబయిలో ఒకటి జరిగింది. జనవరి 25, 26 తేదీల్లో గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో కాన్సర్ట్ నిర్వహించగా.. భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ క్రమంలోనే మార్టిన్ ప్రయాగ్‌రాజ్‌కు వచ్చారు.

# కర్ణాటక ‘చివరి మావోయిస్టు’ లక్ష్మీ లొంగుబాటు



**చెన్నై:** కర్ణాటక మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో చివరి మావోయిస్టుగా భావిస్తోన్న లక్ష్మీ.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉడుపి పోలీసు ఉన్నతాధికారుల ముందు సరెండరైన ఆమె.. ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మీ స్వగ్రామం కుందపుర తాలుకాలోని మచ్చట్టు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం కుటుంబాన్ని విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. అనంతరం నక్సలైట్ అజెండాతో పనిచేయడం ప్రారంభించింది. సమీప ప్రాంతాల్లో మావోయిస్టు సాహిత్యం ప్రచారం చేయడంతోపాటు పోలీసులపై దాడి ఘటనలతో ఆమెపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయి. చాలా ఏళ్లుగా ఏపీలో తలదాచుకున్నట్లు సమాచారం. ఇటీవల లొంగిపోవాలని నిర్ణయించుకున్న లక్ష్మీ.. సరెండర్ కమిటీ సభ్యుడు, గతంలో లొంగిపోయిన ఆమె భర్త సలీంతో కలిసి ఉడుపి పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యారు.

రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సరెండర్ కమిటీ ఏర్పాటు చేసింది. దీంతో లొంగిపోయే వారికి మార్గం సుగమం కావడంతో ఇటీవల అనేక మంది మావోలు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. రెండురోజుల క్రితమే శృంగేరి తాలూకా కిగ్గా గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకుడు రవీంద్ర నెమ్మార్ చిక్కమగళూరులో అధికారుల ముందు లొంగిపోయాడు. రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా మార్చేందుకు కృషి చేసిన 22 మంది పోలీసు అధికారుల బృందానికి చీఫ్ మినిస్టర్ మెడల్ ఇవ్వనున్నట్లు సీఎం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఏపీలో అంతుచిక్కని వైరస్.. లక్షల్లో కోళ్లు మృతి



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో కోళ్లకు అంతుచిక్కని వైరస్ కలవరపెడుతున్నది. సాయంత్రానికి ఆరోగ్యంగా కనిపించే కోళ్లు.. ఉదయం వరకు అనారోగ్యంతో మృత్యువాతపడుతున్నాయి. అలా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో లక్షల రూపాయల నష్టం వస్తుందని కోళ్ల ఫారాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.H15N వైరస్ లక్షణాలతోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మరణిస్తున్నాయని తెలుస్తోంది. డిసెంబర్‌లోనే ఈ వైరస్ మొదలైంది. సంక్రాంతి సమయంలో అంటే జనవరి 13 వరకు ఈ వైరస్ విజృంభించింది. ఈ వైరస్ కారణంగా ఇప్పటికే 40 లక్షల కోళ్లు చనిపోయి ఉంటాయని ఒక అంచనా. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోళ్లకు ఈ H15N వైరస్ రావడం ఇదే తొలిసారి ఏమీ కాదు. 2012, 2020లో కూడా ఇదే తరహాలో వైరస్ వ్యాపించింది. నాలుగేళ్ల క్రితం ఈ వ్యాధి సోకిన అనేక కోళ్లు మృత్యువాతపడ్డాయి. అప్పుడు కోళ్లు ఎందుకు చనిపోతున్నాయో కూడా తెలియని అయోమయం నెలకొంది. వైరస్ సోకి కోళ్లు మరణిస్తున్నాయనే వార్త బయటకు రాగానే అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో చికెన్ ధరలు భారీగా దిగొచ్చాయి. అప్పుడు వైరస్ సోకడానికి చాలా రోజుల సమయం పట్టింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా వైరస్ వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ వైరస్ సోకిన కోడికి లక్షణాలు ఏమీ కనిపించవు. ఎప్పటిలాగే ఆరోగ్యంగా తిరుగుతున్నట్టే కనిపించి.. ఉన్నట్టుండి చనిపోతుంది. ఈ వైరస్ సోకితే దాని ప్రభావం నేరుగా గుండెపైనే ఉంటుందని పశువైద్యులు చెబుతున్నారు. వైరస్ సోకిన కోడికి గుండెనిండా నీరు పట్టేయడం వల్ల గుండెపోటు వంటిది సంభవించి చనిపోతాయని పేర్కొంటున్నారు. వైరస్ సోకిన కోడిని గుర్తించి వ్యాక్సిన్ వేసినా ఫలితం ఏ మాత్రం ఉండదని అంటున్నారు.

## గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికి ఇవ్వాలి

### కేంద్ర మంత్రి సురేష్ గోపి



**న్యూఢిల్లీ:** కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికి ఇవ్వాలని అన్నారు. నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన సురేష్ గోపి ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాలు వారు పర్యవేక్షిస్తేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. ‘గిరిజన సమాజానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ వ్యవహారాల శాఖ మంత్రి అవుతున్నారు. ఇది మన దేశానికి శాపం. గిరిజన సమాజం వెలుపల నుంచి ఒకరిని వారి సంక్షేమం కోసం నియమించాలనేది నా కల. నా భావన. ఒక బ్రాహ్మణుడు లేదా నాయుడు ఆ శాఖ బాధ్యతలు చేపట్టనివ్వండి. గణనీయమైన మార్పు ఉంటుంది’ అని అన్నారు.కాగా, అదే విధంగా గిరిజన నాయకులకు ఉన్నత వర్గాల సంక్షేమ శాఖ ఇవ్వాలని సురేష్ గోపి సూచించారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో అలాంటి మార్పు జరుగాలని అన్నారు. అలాగే గిరిజన వ్యవహారాల శాఖను నిర్వహించాలనే తన కోరికను కూడా ఆయన వ్యక్తం చేశారు. ఆ మంత్రిత్వ శాఖను తనకు కేటాయించాలని ప్రధాని మోదీని కోరినట్లు తెలిపారు. అయితే, శాఖల కేటాయింపులో కొన్ని విధానాలు ఉన్నాయని అన్నారు.

మరోవైపు కేరళలోని త్రిస్సూర్ ఎంపీ సురేష్ గోపి చేసిన ఈ వ్యాఖ్యలపై ఆ రాష్ట్రంలో విమర్శలు వెల్లువెత్తాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బెనోయ్ విశ్వం తీవ్రంగా మండిపడ్డారు. కుల వ్యవస్థపై వ్యాఖ్యలు చేసిన సురేష్ గోపితోపాటు విద్య, సంక్షేమంలో కేరళ వెనుకబడిందని రాష్ట్రాన్ని అవమానించిన కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్‌ను మంత్రి పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## అయోధ్యలో యువతి దారుణ హత్య

### కన్నీటి పర్యంతమైన ఎంపీ



**అయోధ్య:** అయోధ్య(ఫైజాబాద్) ఎంపీ అవధేష్ ప్రసాద్ మీడియా ముందు కన్నీటిపర్యంతమయ్యారు. ఇటీవల కనిపించకుండా పోయిన అయోధ్యకు చెందిన యువతి మృతదేహం అత్యంత దారుణ స్థితిలో దొరకడంతో ఎంపీ ఆవేదనకు లోనయ్యారు. యువతి కనపడకుండా పోయి మూడు రోజులు అవుతున్నా ఆమెను కాపాడలేకపోయామని.. చివరికి దారుణంగా హత్యాచారానికి గురయినట్లు పేర్కొంటూ విలపించారు. ఈ విషయంపై దిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని.. యువతి ప్రాణాలు కాపాడలేనందున పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. దీంతో పార్టీ నేతలు ఆయనను సముదాయించారు. మృతురాలి కుటుంబసభ్యులకు న్యాయం చేయడానికి పోరాడాలని సూచించారు.

**అసలు ఏం జరిగింది?**

అయోధ్య ప్రాంతానికి చెందిన ఓ యువతి(22) గురువారం రాత్రి కనిపించకుండా పోవడంతో ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా వివస్త్రగా ఉన్న యువతి మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులు వారి గ్రామానికి కొంత దూరంలో ఉన్న కాలువలో గుర్తించారు. కాళ్లు, చేతులు తాళ్లతో కట్టివేసి ఉన్నాయని, అమానుషంగా హత్య చేశారని పేర్కొన్నారు. శరీరంలోని వివిధ భాగాలపై లోతైన గాయాలున్నట్లు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామన్నారు. కాగా పోలీసులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.

## కాంగ్రెస్‌లోకి సంజయ్ రౌత్?

**ముంబయి:** శివసేన (యూబీటీ) సీనియర్ నేత సంజయ్ రౌత్ త్వరలో పార్టీని వీడనున్నారని మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత నితీశ్ రాణే వ్యాఖ్యానించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఈ మేరకు ఆ పార్టీతో చర్చలు జరుపుతున్నారని ఆరోపించారు. ‘‘సంజయ్ రౌత్ రాజ్యసభ పదవి కాలం ముగిసే సమయం ఆసన్నమైంది. ఈ సారి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నుంచి నేతలు విజయం సాధించడం కష్టమే. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ 20 స్థానాలు మాత్రమే దక్కించుకోగలిగింది. ఇక పార్టీ భవిష్యత్తు గురించి అర్థం చేసుకున్న సంజయ్ రౌత్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అందుకోసం ఢిల్లీలోని ఓ నాయకుడితో సంప్రదింపులు జరుపుతున్నారు’’ అని మంత్రి నితీశ్ రాణే ఆరోపించారు.‘‘రౌత్ ఇంకా ఎంతకాలం పార్టీలో కొనసాగుతారు..?కాంగ్రెస్‌లో చేరేందుకు ఢిల్లీలో చర్చలు జరుపుతున్న నేత గురించి ఉద్ధవ్ పార్టీ ‘సామ్నా’లో రాయాలి. సంజయ్ రౌత్ కూడా తన ఉద్దేశాన్ని అధికారికంగా ప్రకటించాలి’’ అని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే మధ్య విభేదాలు ఉన్నాయని.. ఇది రాష్ట్ర ప్రజలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఇటీవల సామ్నాలో సంజయ్ పేర్కొన్నారు. శిందే సీఎం పదవి కోసం పోరాడుతున్నారని.. ఈ విషయంపై ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయంటూ ఆరోపించారు. దీనిపై తాజాగా స్పందించిన మంత్రి నితీశ్ రాణే ఆరోపణలను ఖండించారు. సంజయ్ రౌత్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఏపీలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి..

### ఎన్నికల కమిషనర్‌కు వైసీపీ వినతి పత్రం అందజేత



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఈనెల 3న జరుగనున్న పలు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అక్రమాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి వైసీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఏపీలో వివిధ కారణాలతో ఖాళీ అయిన తిరుపతి , నెల్లూరు , ఏలూరు, పాలకొండ, హిందుపురం, తుని, నూజివీడు , గురజాల, కొవ్వూరు, నందిగామకు చెందిన మున్సిపల్‌లో మేయర్, చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ పదవులను భర్తీ చేసేందుకు సోమవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఎన్నికలను నిర్వహిస్తుంది. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు తమ అభ్యర్థులను బెదిరిస్తున్నారని, ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారని పేర్కొంటూ వైసీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా జరిపించాలని, వైసీపీ అభ్యర్థులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఎన్నికలు జరిగే ప్రాంతం వద్ద గట్టి పోలీస్ బందోస్తు కల్పించాలని , సీసీ కెమెరాల మధ్య ఎన్నికల నిర్వహణ జరుగాలని ఆమెను కోరారు. ఎన్నికల్లో ఇండిపెండెంట్ అబ్జర్వర్‌లను నియమించాలని విన్నవించారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి , పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ , వెస్ట్ ఇన్‌చార్జి వేలంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు , ఎమ్మెల్సీ రూహుల్లా , నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## బీజేపీ గూండాయిజం చేస్తోంది: కేజ్రీవాల్



**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో దిల్లీలో రాజకీయం వేడెక్కింది. పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ బీజేపీ గూండాయిజం చేస్తోందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కమలం పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ‘ఢిల్లీలో జరిగే ఎన్నికల్లో ఆప్ విజయం దిశగా పయనిస్తోంది. ఇది భాజపా నాయకులను.. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ను అయోమయానికి, నిరాశకు గురిచేస్తోంది. అందుకే ఆ పార్టీ నేతలు ఆప్ కార్యకర్తలపై బెదిరింపులు, దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు మేము భయపడం. ఆ పార్టీకి దిల్లీ అభివృద్ధిపై అజెండా లేదు. సీఎం అభ్యర్థి కూడా లేదు. వారికి కేవలం గూండాయిజం మాత్రమే తెలుసు’ అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దిల్లీ ప్రజలంతా ఎన్నికల్లో భాజపాను ఓడించి బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీఈసీకి లేఖ..**

అంతకు ముందు కేజ్రీవాల్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు లేఖ రాశారు. తమ పార్టీ కార్యకర్తలపై కమలం పార్టీతో పాటు పోలీసులు పదే పదే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు న్యూ దిల్లీ నియోజకవర్గానికి స్వతంత్ర ఎన్నికల పరిశీలకులను నియమించాలని అభ్యర్థించారు. ఆప్ వాలంటీర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా.. ఫిబ్రవరి 5న దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## ముంబయిలో ‘బ్యాట్’ పట్టిన రిషి సునాక్

**ముంబయి:** బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ముంబయిలో పర్యటించారు. ఈ సందర్భంగా దక్షిణ ముంబయిలోని పార్సీ జింఖానా గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేశారు. ఈ విషయాన్ని ఆయన ‘ఎక్స్’ వేదికగా వెల్లడిస్తూ.. ‘టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడకుండా నా ముంబయి పర్యటన ఎప్పుడూ ముగియదు’ అని పేర్కొన్నారు. జైపుర్‌లో ఐదు రోజులపాటు జరుగుతోన్న లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు రిషి సునాక్ భారత్‌కు వచ్చారు. శనివారం అక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. అనంతరం ముంబయికి చేరుకున్నారు. స్థానిక పార్సీ జింఖానాకు ఆదివారం ఉదయం వెళ్లారు. క్లబ్ వార్షికోత్సవాల నేపథ్యంలో అక్కడికి వచ్చిన వారితో కాసేపు ముచ్చటిస్తూ క్లబ్ సాధించిన విజయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం బ్యాట్ చేతపట్టి కాసేపు క్రికెట్ ఆడారు.

## సంజుకు అవకాశాలు
# ఇస్తూనే ఉండాల్సిందే
### భారత మాజీ క్రికెటర్

**ముంబయి:** ఇంగ్లండ్‌తో జరుగుతోన్న టీ20 సిరీస్‌లో భారత క్రికెటర్ సంజు శాంసన్ పెద్దగా ప్రభావం చూపించలేదు. ఆరంభంలో దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించి ప్రత్యర్థి బౌలర్లకు వికెట్‌ను ఇచ్చేస్తున్నాడు. మరీ ముఖ్యంగా ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ సంధించే షార్ట్ పిచ్ బంతులకు బౌండరీ లైన్ వద్ద దొరికిపోయాడు. ఈ క్రమంలో ఇంగ్లండ్‌తో ఇవాళ ఐదో టీ20 మ్యాచ్‌ను టీమ్‌ఇండియా ఆడనుంది. ఇప్పటికే 3-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో సంజును పక్కన పెడతారనే వాదనా వినిపిస్తోంది. దీనిపై భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించాడు. సంజుకు అవకాశాలు ఇస్తూనే ఉండాలని సూచించాడు. ''సంజు మంచి ఫామ్‌లో ఉంటే అతడిని ఆపడం ఎవరి తరమూకాదు. బ్యాటింగ్‌తో జట్టును విజయపథంలో నడిపిస్తాడు. అలాంటి క్రికెటర్ విఫలమైనప్పుడు మద్దతుగా ఉండాలి. అవకాశాలు ఇస్తూనే వెళ్లాలి. టీ20 క్రికెట్‌లో జట్టు కోసం రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ అతడు దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్‌కు చేరాడు. ఒక్క మంచి ఇన్నింగ్స్‌తో మళ్లీ ఫామ్ అందుకొంటాడు. మరొక ప్లేయర్ అయితే ఫామ్ కోల్పోయినా వారికి ఛాన్స్‌లు ఇస్తుంటారు. ఏదొక మ్యాచ్‌లో 40 లేదా 50 కొడితే చాలు అనుకొంటారు. కానీ, సంజు విషయంలో మాత్రం కాస్త ఓర్పు ప్రదర్శించలేరు'' అని సంజయ్ వెల్లడించాడు.



## సంఘ్వాన్‌పై ఫ్యాన్స్ ఆగ్రహం..
# హుందాగా ప్రవర్తించిన విరాట్!

**ముంబయి:** దాదాపు 12 ఏళ్ల తర్వాత విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడాడు. ఢిల్లీ ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది. కానీ, ఒకే ఒక్క ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మాత్రం ఆరు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. రైల్వేస్ బౌలర్ హిమాన్షు సంఘ్వాన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో తమ అభిమాన క్రికెటర్‌ను ఔట్ చేస్తావా? అంటూ సంఘ్వాన్‌పై విరాట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కొందరు నెగెటివ్ కామెంట్లు చేశారు. అయితే, మ్యాచ్ ముగిసిన తర్వాత తన వద్దకు వచ్చిన హిమాన్షు సంఘ్వాన్‌తో విరాట్ హుందాగా ప్రవర్తించాడు. మంచి బంతి విసిరావని కొనియాడి బంతిపై ఆటోగ్రాఫ్ చేసి ఇచ్చాడు. ఈ విషయాన్ని హిమాన్షు వెల్లడించాడు. ''మ్యాచ్ ముగిసిన తర్వాత నేను కోహ్లీ వద్దకు వెళ్లా. బంతిపై ఆటోగ్రాఫ్ తీసుకున్నా. ఈ సందర్భంగా నాతో కోహ్లీ మాట్లాడుతూ 'అద్భుతంగా బంతిని విసిరావు. చాలా బ్యూటిఫుల్ డెలివరీ. ఆ బంతిని నేను ఆస్వాదించా' అని అన్నాడు. ఆ మాటలు నాలో స్ఫూర్తి నింపాయి. నేను అండర్ 19లో ఢిల్లీ



తరపున ఆడా. ఆ విషయం కోహ్లీకి తెలిసింది. దానిపై స్పందిస్తూ 'అవును, నేను కూడా విన్నా. నువ్వు చాలా మంచి బౌలర్. అద్భుతమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా' అని చెప్పాడు. నా జీవితంలో విరాట్ కోహ్లీ వికెట్ అత్యంత అమూల్యమైనది'' అని సంఘ్వాన్ తెలిపాడు.

**సోషల్ మీడియాలో..**

విరాట్ కోహ్లీ ఆఫ్‌సైడ్ ఆడటంలో ఇబ్బంది పడుతున్నాడనే విషయం తెలిసిందే. దీంతో ఫామ్ అందుకోవడానికి రంజీ మ్యాచ్ ఆడాడు. అతడి కోసం అరుణ్ జైట్లీ స్టేడియానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. కోహ్లీని ఆరు పరుగులకే క్లీన్‌బౌల్డ్ చేసిన రైల్వేస్ బౌలర్ హిమాన్షు సంఘ్వాన్ అరుస్తూ సంబరాలు చేసుకొన్నాడు. దీంతో విరాట్ ఫ్యాన్స్ ఒక్కసారిగా హిమాన్షును టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో రెచ్చిపోయారు. కానీ, విరాట్ మాత్రం హుందాగా వ్యవహరించడం సగటు క్రికెట్ అభిమానిని ఆకట్టుకుంది.

## జవగళ్ శ్రీనాథ్ అంగీకరించాలి: కెవిన్ పీటర్సన్

**ముంబయి:** శివమ్ దూబె - హర్షిత్ రాణా కంకషన్ సబ్‌స్టిట్యూట్ వివాదంపై మరోసారి ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ స్పందించాడు. మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ పొరపాటును అంగీకరించాలని సూచించాడు. ''కంకషన్ సబ్ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. చాలా మంది అభిప్రాయం.. నా లెక్క ప్రకారం కూడానూ ఇది సరైన రిప్లేస్‌మెంట్ కాదు. అందుకే, మ్యాచ్ రిఫరీ శ్రీనాథ్ పొరపాటును అంగీకరించాలి. సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు వెళ్లిపోదాం'' అని పోస్టు చేశాడు.



# పాక్‌తో మ్యాచ్‌కు ప్రత్యేకతేమీ లేదు: గంభీర్

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్ కూడా.. మిగతా మ్యాచ్‌ల్లాంటిదేనని టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ అన్నాడు. ఈ టోర్నీలో ఇతర మ్యాచ్‌లకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో దీనికి అంతే అని.. అదనంగా ఏమీ లేదని పేర్కొన్నాడు.బీసీసీఐ అవార్డుల కార్యక్రమం సందర్భంగా ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో మాట్లాడుతూ ''ఈ నెల 23న జరగనున్న మ్యాచ్ అత్యంత ముఖ్యమైందని మేము భావించడంలేదు. అన్ని మ్యాచ్‌లూ ముఖ్యమైనవేనని అనుకొంటున్నాం. ఛాంపియన్స్ ట్రోఫీలో విజయం సాధించాలనే లక్ష్యంతో మేము దుబాయ్ వెళుతున్నాం. అంతే కానీ.. ఏదో ఒక మ్యాచ్ కోసం కాదు. కాకపోతే ట్రోఫీ గెలిచే క్రమంలో అది కూడా కీలకమైన గేమే. వీలైనంత సీరియస్‌గా ఈ మ్యాచ్‌ను తీసుకొంటాం. వాస్తవానికి భారత్-పాక్‌లు తలపడే మ్యాచ్‌లో భావోద్వేగాలు తారస్థాయిలో ఉంటాయి. కానీ, పోటీ మాత్రం ఒకటే. సాధారణ వన్డే వరల్డ్‌కప్‌తో పోలిస్తే ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీ చాలా భిన్నంగా ఉంటుంది. ప్రతి మ్యాచ్ తాడోపేడో అన్నట్లు జరుగుతుంది. ఈ టోర్నీలో మీరు ఎక్కడా ఆగకూడదు. అందుకే ట్రోఫీ కావాలంటే ఐదు మ్యాచ్‌లు గెలవాల్సిందే'' అని గంభీర్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌కు అనవసర ప్రాధాన్యం ఇచ్చి జట్టుపై ఒత్తిడి పెంచకూడదన్నది గంభీర్ వ్యూహంగా కనిపిస్తోంది. భారత్-పాక్ మ్యాచ్ దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది.ఇప్పటికే రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమ్ ఇండియా జట్టును ప్రకటించారు. ఈ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు మాత్రమే గతంలో ఛాంపియన్స్ ట్రోఫీ ఆడిన అనుభవం ఉంది. వీరు 2013లో ఇంగ్లాండ్‌పై గెలిచిన జట్టులో సభ్యులు.

## కలలను నిజం చేసుకోవడంలో మా తరానికి స్ఫూర్తి
### సచిన్‌పై యువీ స్పెషల్ పోస్టు

**ముంబయి:** బీసీసీఐ నమన్ అవార్డుల కార్యక్రమంలో శనివారం ముంబయిలో ఘనంగా జరిగింది. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను బీసీసీఐ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డుతో సత్కరించింది. భారత క్రికెట్‌కు అందించిన సేవలకు గాను ఈ అవార్డును సచిన్‌కు అందించడంపై మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా పోస్టు పెట్టాడు.'' కంగ్రాట్స్ మాస్టర్. సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకొన్నందుకు శుభకాంక్షలు. ప్రతి క్రికెటర్‌కు మీరే స్ఫూర్తి. కఠినమైన శ్రమతో కలలను నిజం చేసుకోవాలని భావించే మా తరంలోని ప్రతి క్రికెటర్‌కి.. అవిశ్రాంత కృషి, అచంచల నమ్మకంతో కలలు సాకారం అవుతాయని మాకు చూపించిన వ్యక్తి మీరే. ఆటపైనే కాకుండా మాపై తీవ్ర ప్రభావం చూపించిన క్రికెటర్. మీతో కలిసి మైదానం పంచుకోవడం గొప్పగా భావిస్తున్నా. మీ పట్ల ఇదే ప్రేమ, గౌరవం ఎల్లవేళలా ఉంటుంది'' అని యువరాజ్ పోస్టు చేశాడు.1989లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సచిన్ 2013లో వీడ్కోలు పలికాడు. భారత్ తరఫున 664 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. కెరీర్‌లో వంద శతకాలు చేసిన ఏకైక బ్యాటర్. మరో 164 అర్ధశతకాలు బాదాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్ కూడా సచినే కావడం విశేషం. అదే విధంగా అందరికంటే అత్యధికంగా సచిన్ 200 టెస్టులు ఆడాడు.

# ధోనీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నారా?

**ముంబయి:** మహేంద్ర సింగ్ ధోనీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి కేవలం ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న ధోనీకి ఫ్యాన్‌బేస్ ఏమాత్రం తగ్గలేదు. ధోని సారధ్యంలో భారత్ 2007 ప్రపంచ టీ20, 2011 వన్డే ప్రపంచ కప్, 2013 ఛాంపియన్ ట్రోఫీ సొంతం చేసుకుంది. ఈ మూడు కప్పుల్ని సాధించిన ఏకైక కెప్టెన్ ధోనీనే. ప్రస్తుతం ఆయన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నారా?అన్న అంశంపై చర్చలు నడుస్తున్నాయి.



ధోని రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నారంటూ గతంలో పుకార్లు వచ్చాయి. ఆయన పొలిటికల్ ఎంట్రీపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంశంపై స్పందించారు. ''ధోనీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడం వ్యక్తిగతం. అయితే బెంగాల్ రాజకీయాల్లోకి వస్తారని నేను ఊహించాను. ధోనీ రాజకీయాల్లో కూడా రాణించగలడు. వస్తే సులభంగా గెలుస్తాడు. అతనికి మంచి ప్రజాదరణ ఉంది'' అని శుక్లా అన్నారు. అయితే ఈ సందర్భంగా ధోనీతో జరిగిన పాత సంభాషణను గుర్తుకు తెచ్చుకున్నారు. 'ఒకసారి ధోనీ లోక్‌సభ స్థానానికి పోటీ చేయనున్నారని పుకార్లు వచ్చాయి. ఆ విషయాన్ని తనతో చెప్పాను. అది కేవలం పుకార్లు మాత్రమే' అని కొట్టిపారేశారని తెలిపారు.

## రంజీ ట్రోఫీ గొప్పదనం తెలుసా?
# క్రికెటర్లకే బెనిఫిట్.. టోర్నీకి కాదు: అశ్విన్

**ముంబయి:** భారత స్టార్ క్రికెటర్లు ఇప్పుడు మళ్లీ రంజీల్లోకి అడుగు పెట్టారు. రోహిత్, విరాట్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ తదితరులు చాన్నాళ్ల తర్వాత ఆడారు. బీసీసీఐ స్పష్టమైన ఆదేశాల మేరకు బరిలోకి దిగక తప్పలేదు. తాజాగా ఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ రైల్వేస్‌తో మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. కేవలం ఆరు పరుగులే చేశాడు. కానీ, అతడిని చూసేందుకు అరుణ్ జైట్లీ స్టేడియానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఓ ఫ్యాన్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు భారత మాజీ క్రికెటర్ అశ్విన్ సమాధానం ఇచ్చాడు. అసలు రంజీ ట్రోఫీ చరిత్ర తెలుసా? అంటూ ఘాటుగా స్పందించాడు.



''విరాట్ కోహ్లీ మళ్లీ రంజీల్లోకి అడుగు పెట్టడం బాగుంది. అతడు తప్పకుండా క్రికెట్ పట్ల స్ఫూర్తిగా నిలుస్తాడు. టెస్టు క్రికెట్ ఆడాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇంకా అతడి నుంచి నాణ్యమైన ఆటను చూసే అవకాశం ఉంది. చాలా మంది మాత్రం అతడి పనైపోయినట్లు భావిస్తున్నారు. ఇక రంజీ మ్యాచ్ సందర్భంగా కోహ్లీని చూసేందుకు భారీగా అభిమానులు తరలి వచ్చారు. ఇలాగే ప్రతి మ్యాచ్‌కు వస్తే బాగుండు. సోషల్ మీడియాలో ఓ పోస్టు చూశా. 'కోహ్లీ రాకతో రంజీ ట్రోఫీకి మంచి జరిగింది' అని ఓ అభిమాని పోస్టు చేశాడు. నేనో విషయం అడుగుతున్నా. అసలు నీకు (సదరు పోస్టుపెట్టిన వ్యక్తిని) రంజీ ట్రోఫీ చరిత్ర తెలుసా? గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దేశవాళీలో గొప్ప టోర్నమెంట్. సచిన్ తెందూల్కర్ వంటి దిగ్గజ క్రికెటర్ ఆడాడు. ఈ టోర్నీతో ప్లేయర్లకు బెనిఫిట్. క్రికెట్‌కు ఆడుతోన్న ఆటగాళ్లు ముఖ్యం కాదు. అయితే, ప్లేయర్లకు క్రికెట్ అత్యంత ముఖ్యం. హిమాన్షు సంఘ్వాన్ అద్భుతమైన బంతిని సంధించి విరాట్‌ను ఔట్ చేశాడు. రంజీల్లో అతడు సాధారణ బౌలర్ కాదు. ప్యాడ్, బ్యాట్‌కు మధ్యలో బంతి దూసుకుపోయేలా సంధించడం తేలికైన విషయం కాదు. విరాట్ బ్యాటింగ్‌ను చూశా. కాస్త బ్యాట్ వేగంగా ఊపినట్లు అనిపించింది. ప్రదర్శన సంగతి పక్కనపెడితే.. విరాట్ కోహ్లీకి ఉన్న అభిమాన గణం అద్భుతం. అతడు ఆడటం నాకు సంతోషం కలిగించింది'' అని అశ్విన్ తెలిపాడు.

**దూబె ప్లేస్‌లో హర్షిత్ రావడంపై..**

ఇంగ్లండ్‌తో నాలుగో టీ20 మ్యాచ్‌లో హర్షిత్ రాణా ఎంట్రీపై వివాదం రేగిన సంగతి తెలిసిందే. శివమ్‌దూబెకు కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా హర్షిత్ రావడం.. అతడు మూడు వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించడంపై మాజీలు స్పందించారు. దీనిపై అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. ''మ్యాచ్ ముగిసింది. భారత్ మరో సిరీస్‌ను సొంతం చేసుకుంది. అంతర్జాతీయ మ్యాచ్ అని మరిచిపోయి ఐపీఎల్ మ్యాచ్ ఆడారా? అనేది నా ప్రశ్న. దూబె కంకషన్‌పై చర్చ మొదలైంది. గతంలో కాన్‌బెర్రాలో ఆసీస్‌పై రవీంద్ర జడేజా స్థానంలో చాహల్ వచ్చాడు'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.




# పనితీరు మెరుగుపడని ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ వేటు!

**ముంబయి:** పనితీరు మెరుగుపడని ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయాన్ని బిజినెస్ ఇన్‌సైడర్ పత్రిక వెల్లడించింది. తాజాగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి మెడికల్, ప్రిస్‌క్రిప్షన్, డెంటల్ హెల్త్‌కేర్ లబ్ధిలు వెంటనే నిలిచిపోతాయని వారి తొలిగింపు ఆదేశాల్లో పేర్కొన్నట్లు ఆ కథనంలో వెల్లడించారు. కొందరు ఉద్యోగులకు సర్వీస్ పే కూడా చెల్లించనట్లు తెలుస్తోంది. ''మీ పొజిషన్‌కు తగినట్లు పనితీరులో కనీస ప్రమాణాలు అందుకోలేదు. దీంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నాం. మిమ్మల్ని అన్ని డ్యూటీల నుంచి రిలీవ్ చేస్తున్నాం. మైక్రోసాఫ్ట్ సిస్టమ్‌లు, అకౌంట్స్, బిల్డింగ్‌ల్లోకి పర్మిషన్లను నిలిపివేస్తున్నాం. ఇక మీరు మైక్రోసాఫ్ట్ తరఫున ఏ పనీ చేయకూడదు'' అని సదరు ఉద్యోగులకు పంపిన లేఖలో వెల్లడించారు. మళ్లీ ఇదే కంపెనీలో కొత్త ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటే గతంలో ఆ ఉద్యోగి పనితీరు, టర్మినేషన్‌కు గురైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని మైక్రోసాఫ్ట్ వారికి వెల్లడించింది. ఇటీవల కంపెనీ లెవల్ 80 వరకు ఉద్యోగుల పనితీరును విశ్లేషించింది. జూన్ 2024 నాటికి కంపెనీలో 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇటీవలే మైక్రోసాఫ్ట్ సెక్యూరిటీ, డివైజ్, సేల్స్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై కూడా వేటు వేసింది.

# రక్షణ బడ్జెట్ విశిష్టతను అర్థం చేసుకోవాలి
### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ రక్షణ వ్యయాల్లో కోత విధించలేదని.. అదే సమయంలో పింఛన్లు, కొనుగోళ్లను కూడా తగ్గించలేదని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్ అనంతరం ఆమె ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలను వెల్లడించారు. ''మేము వారిపై చాలా శ్రద్ధ చూపించాం. ఈ సారి కూడా డిఫెన్స్ బడ్జెట్‌తో ఎటువంటి సమస్య లేదు. దాని విశిష్టతను మీరు అర్థం చేసుకోవాలి. మనం ఏదైనా ఆర్డర్ ఇస్తే దానికి ఇన్‌స్టాల్ మెంట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇది సుదీర్ఘ కాలం కొనసాగుతుంది. రక్షణ కొనుగోళ్లలో దాదాపు 60 శాతం భారత్‌లో తయారైనవే అన్న విషయాన్ని మనం గుర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశీయ అవసరాల కోసమే కాదు.. ఎగుమతుల కోసం కూడా పరికరాలను తయారు చేస్తున్నాం.




ఎక్స్‌పోర్టుల ద్వారా రూ.25 వేల కోట్లు సంపాదించాము'' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. రక్షణ బడ్జెట్ కింద రూ.6,81,210 కోట్లను ప్రతిపాదించారు. 2024-25 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఇది 9.53 శాతం అధికం. సవరించిన అంచనాల (రూ.6.41 లక్షల కోట్ల)తో పోలిస్తే 6.2 శాతం ఎక్కువ. తాజా కేటాయింపుల్లో కొత్త ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు పెద్దపీట వేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో రక్షణ కేటాయింపులు 1.91 శాతంగా ఉన్నాయి. మూలధన వ్యయం కింద రూ.1.8లక్షల కోట్లను కేంద్రం కేటాయించింది. కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక హార్డ్‌వేర్ కొనుగోలుకు ఈ సొమ్మును వెచ్చిస్తారు.

## ఎయిరిండియా 'నమస్తే వరల్డ్ సేల్'.. టికెట్లపై రాయితీ




**ముంబయి:** టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా 'నమస్తే వరల్డ్ సేల్' పేరిట విమాన టికెట్లపై ఆఫర్లు ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణానికి టికెట్లపై రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు ఈ సేల్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 21 నుంచి అక్టోబర్ 31 మధ్య ప్రయాణం కోసం బుక్ చేసే టికెట్లపైనే (ఎంపిక చేసిన రూట్లలో) ఈ ఆఫర్ వర్తిస్తుంది. దేశీయ ప్రయాణానికి ఎకానమీ క్లాస్ టికెట్ ధరలు రూ.1,499 నుంచే ప్రారంభమవుతాయని ఎయిరిండియా తెలిపింది. బిజినెస్ క్లాస్ ధరలు రూ.9,999 నుంచి మొదలవుతాయని పేర్కొంది. అంతర్జాతీయ ప్రయాణానికి ఎకానమీ క్లాస్‌లో రూ.12,577, బిజినెస్ క్లాస్‌లో రూ.20,870 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్ నుంచి బుక్ చేసుకొనే దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై ఎటువంటి కన్వినియన్స్ రుసుము వసూలు చేయబోమని తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, బీఓబీ బ్యాంక్ ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే కేటగిరీని బట్టి అదనపు డిస్కౌంట్ కూడా పొందవచ్చని తెలిపింది. లిమిటెడ్ సీట్లకు, తొలుత బుక్ చేసుకున్న వారికే ఆఫర్స్ వర్తిస్తాయని ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది.

# శంకరాభరణం.. అట్టర్‌ఫ్లాప్ అవుతుందన్న వారే ఆశ్చర్యపోయారు!



### 45ఏళ్లు పూర్తిచేసుకున్న సినిమా

తెలుగు సినీ చరిత్రలో 'శంకరాభరణం' ఒక ఆణిముత్యం. 1980 ఫిబ్రవరి 2న విడుదలైన ఈ చిత్రం జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది. నేటితో ఈ సినిమా విడుదలై 45 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా ఆ సినిమా ఎలా తెరకెక్కింది.. ప్రేక్షకుల ముందుకు ఎలా వచ్చిందంటే..

సంగీత ప్రాధాన్యమున్న కథతో సినిమా తీయాలనుకున్నప్పుడు దర్శకుడు విశ్వనాథ్ మదిలో మెదిలిన ఆలోచన అగ్ర నటీనటులు కాకుండా ఒక కొత్త వ్యక్తిని పెట్టి తెరకెక్కించాలనుకున్నారు. ఆ సమయంలో 'రారా కృష్ణయ్య'లో నటించిన జొన్నలగడ్డ వెంకట సోమయాజులుని శంకరశాస్త్రి పాత్ర కోసం తీసుకున్నారు. అలాగే మంజు భార్గవి కూడా అప్పటికి పెద్ద పేరున్న నటేమీ కాదు. ఇక షూటింగ్‌కు వెళ్లాక ప్రతి షాటునీ శ్రమతో, ప్రతి దృశ్యాన్ని శ్రద్ధతో తీశారు. మొదటి కాపీ చూసిన వారు విశ్వనాథ్‌కు జేజేలు పలికారు.

ఆ రోజుల్లో ప్రజల్లోకి సినిమా తీసుకువెళ్లాలంటే కొనుగోలుదారులే దారి. హీరోల సినిమాలకు జిల్లాల వారీగా కొన్ని ధరలుండేవి. నిర్మాత, కొనుగోలుదారు ఒక మాట అనుకుని వ్యాపారం చేసేవారు. 'శంకరాభరణం' కొనుగోలుదారుల ముందుకు వెళ్లింది. 'నడిగర్ సంఘం' ఆవరణలోని థియేటర్ బుక్ చేసి సినిమా వేశారు. కొందరు మిత్రులు, పరిశ్రమలోని ముఖ్యమైన వాళ్లు సినిమా చూసి బాగుందని చెప్పారు తప్ప.. సినిమాను కొనడానికి ముందుకు రాలేదు. 'మంజు భార్గవికి పెద్దగా పేరు లేదు. జయమాలినిని పెట్టి ఉంటే బాగుండేది' అని ఒకరు.. 'కొత్తవాడు కాకుండా అక్కినేని నాగేశ్వరరావుని పెట్టి తీసి ఉంటే ఆయన కోసం కొనేవాళ్లం' అని ఒకరు.. 'జనం చూడరండీ.. పాటలు, నృత్యాలు ఎవడిక్కావాలి? అట్టర్ ఫ్లాప్ అవుతుంది, నా చేతులు కాల్చుకోలేను' అని ఇంకొకరు.. ఇలా విమర్శలు చేశారు.

నిర్మాత ఏడిద నాగేశ్వరరావు డీలా పడిపోయారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జనంలోకి వెళ్తే ఆదరణ లభిస్తుందని విశ్వనాథ్ నమ్మకం. కానీ వెళ్లడం ఎలా? కనీసం పారితోషికం కూడా తీసుకోలేదు. సినిమా విడుదలై బాగా నడిస్తే వచ్చిన దానిలో లాభం తీసుకుందామనుకున్నారు. అలాగే ఒప్పందం చేసుకున్నారు. చివరికి ఏడిద నాగేశ్వరరావు నష్టానికే కొన్ని జిల్లాలకు అమ్మేశారు. కొన్ని జిల్లాల్లో అమ్ముడు పోలేదు. సినిమా విడుదలైంది. ఓపెనింగ్స్ లేవు. మూడో రోజు, నాలుగో రోజు థియేటర్లు వెలవెల బోయాయి. 'బాగుంది' అన్న మాట మాత్రం వినిపిస్తోంది. నిదానంగా ఈ మాటే ప్రచార సాధనమై రెండో వారం నుంచి ఊపందుకుంది.

ప్రేక్షకులు ఆనంద పరవశులైపోయారు. రెండోసారీ, మూడోసారీ చూడటం ఆరంభించారు. మామూలు హిట్ కాదు.. పెద్ద హిట్, మూడో వారంలో బ్లాక్‌లో టికెట్లు కొని మరీ చూశారు. దర్శక-నిర్మాతల ఆనందానికి అవధుల్లేవు. ఎక్కడ చూసినా 'శంకరాభరణం' పాటలే. తమిళ, కన్నడ భాషల్లో కూడా బాగా ఆడింది. మలయాళంలో మాటలు డబ్ చేసి, పాటలను తెలుగులోనే ఉంచి విడుదల చేశారు. అక్కడా పెద్ద హిట్. కొనలేకపోయినవాళ్లు నెత్తినోరూ మొత్తుకున్నారు. అమ్ముడుపోక తానే అట్టిపెట్టుకున్న జిల్లాల ద్వారా నిర్మాతకు కలెక్షన్ల పంట పడింది.

# ఈసారి కప్పు మనదే




**అఖిల్**

**హైదరాబాద్:** సినీ తారల క్రికెట్ లీగ్ కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. దాదాపు 10 సీజన్లగా సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతున్న సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) సరికొత్త సీజన్‌తో త్వరలో ప్రేక్షకులను అలరించనుంది. ఈనేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ తారలకు చెందిన తెలుగు వారియర్స్ టీమ్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం సందడి జరిగింది. ఇందులో జట్టు కెప్టెన్ అఖిల్ తోపాటు తమన్, ఆది, అశ్విన్, రఘు, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు. జట్టు యజమాని సచిన్ జోషి కూడా పాల్గొని టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అఖిల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది కప్పు తమదేనంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. ''సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఐడియాతో సుమారు 13 ఏళ్ల క్రితం విష్ణు దీనిని ప్రారంభించారు. దీని గురించి చెప్పినప్పుడు ఇది వర్కౌట్ అవుతుందా? లేదా? అనేది ఎవరికీ తెలియదు. కానీ ఇప్పుడు మనం 11వ సీజన్‌లోకి అడుగుపెట్టాం. దా దా పు దశాబ్దకాలం పాటు ఒక కార్యక్రమం కొనసాగిందంటే అంటే అర్థం ఇది సక్సెస్ అయినట్టే. ఆయన హార్డ్‌వర్క్, అభిరుచి, నమ్మకంతోనే ఇది సాధ్యమైంది. క్లిష్ట సమయంలో లీగ్‌ను నడిపించడానికి ఆయన ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. మేము ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చి నిలబడ్డాం. ఇప్పటివరకూ మేము నాలుగుసార్లు గెలిచాం. ఐదోసారి కూడా కప్పు కొట్టాలనుకుంటున్నాం. ఆటతోపాటు అందరినీ ఎంటర్‌టైన్ చేయాలని అనుకుంటున్నాం. మేము ఎంతో అభిరుచితో ఆడుతున్నాం. ఉప్పల్ స్టేడియంలో ఫిబ్రవరి 14, 15న మ్యాచ్ ఆడుతున్నాం. అక్కడికి రండి మమ్మల్ని ప్రోత్సహించండి'' అని అఖిల్ తెలిపారు.తమన్ మాట్లాడుతూ.. క్రికెట్ అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ వల్ల క్రికెటర్ కావాలనే తన కల నెరవేరిందన్నారు. వర్క్ లైఫ్‌లో ఎంతో ఒత్తిడిగా ఉన్న తమకు క్రికెట్ ప్రశాంతతనిస్తుందని అన్నారు. ఈ ఏడాది కూడా తప్పకుండా కప్పు కొడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రికెట్ ప్రముఖులు ఆడిన మైదానంలో తాము ఆట ఆడుతుంటే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. చిన్నస్వామి స్టేడియంలో ఫిబ్రవరి 8న తొలి మ్యాచ్ జరగనుందని అన్నారు. బెంగళూరులో ఉన్న తెలుగువారు మ్యాచ్ వీక్షించడానికి రావాలని.. తమని ప్రోత్సహించాలని కోరారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఫిబ్రవరి 8 నుంచి మార్చి 2 వరకూ జరగనుంది.

# అగ్ర హీరోలపై ప్రశ్న.. విలేకరిపై పూజాహెగ్డే ఆగ్రహం



**ముంబయి:** పూజాహెగ్డే కథానాయికగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దేవా' . ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పూజాహెగ్డే, నటుడు షాహిద్ కపూర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అగ్ర హీరోల చిత్రాల్లో నటించడంపై పూజాహెగ్డేకు ప్రశ్నలు ఎదురుకాగా.. ఆమె ఆగ్రహానికి గురయ్యారు. ''బాలీవుడ్ అగ్ర హీరోలైన సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడాన్ని అదృష్టంగా భావిస్తారా? ఆయా చిత్రాలకు మీరు అర్హులేనని అనుకుంటున్నారా?'' అని విలేకరి ప్రశ్నించాడు. ''ఆయా చిత్రాలకు నేను అర్హురాలినే. తమ చిత్రాల్లోకి నన్ను ఎంపిక చేసుకోవడంపై దర్శక నిర్మాతలకు కొన్ని కారణాలు ఉంటాయి. ఏదైనా అవకాశం వచ్చినప్పుడు దానికి అనుగుణంగా సన్నద్ధమై పూర్తి స్థాయిలో ఆ పాత్రకు



న్యాయం చేయాలి. అలా చేస్తే అదృష్టం వరించినట్లే అనుకుంటా. నా జీవితంలో అదే జరిగింది. ఒకవేళ మీరు అదృష్టం వల్లే నాకు ఈ అవకాశాలు వచ్చాయనుకుంటే.. నేను ఏమాత్రం బాధపడను. అలాగే అనుకోండి'' అని కాస్త అసహనం వ్యక్తం చేశారు. ''మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల చిత్రాలైతేనే చేస్తారా?'' అని విలేకరి ప్రశ్నించాడు. స్టార్ హీరోల గురించి వరుస ప్రశ్నలు వేయడంపై పూజాహెగ్డే ఆగ్రహానికి గురయ్యారు. ''అసలు మీ సమస్య ఏంటి?'' అని ప్రశ్నించారు. వాతావరణం కాస్త హీటెక్కుతోందని భావించిన షాహిద్ కపూర్ వెంటనే సరదాగా మాట్లాడారు. ''నువ్వు యాక్ట్ చేసిన స్టార్ హీరోలంటే అతడికి ఇష్టం అనుకుంటా. అతడు కూడా ఆ హీరోల పక్కన యాక్ట్ చేయాలనుకుంటున్నారు. అందుకే నీ నుంచి సలహాలు తీసుకుంటున్నట్లు ఉన్నారు'' అని జోకులు వేశారు.

# అభిమానికి ముద్దు.. నేను ఏమీ బాధపడటం లేదు

**ఉదిత్ నారాయణ్**

ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ్ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తనతో ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపించిన మహిళా అభిమానులను ఆయన ముద్దు పెట్టుకోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఆయన తాజాగా మరోసారి క్లారిటీ ఇచ్చారు. అభిమానులతో తాను ఆ విధంగా ప్రవర్తించినందుకు ఏమాత్రం బాధపడటం లేదని తెలిపారు. ''నాకు, నా కుటుంబానికి, దేశానికి చెడ్డపేరు తీసుకువచ్చే పని ఇప్పటివరకూ ఎప్పుడూ చేయలేదు. అలాంటప్పుడు ఇప్పుడెందుకు అలాంటి పనులు చేస్తాను. నా అభిమానులతో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలో మీరు చూసింది మా మధ్య ఉన్న ప్రేమకు నిదర్శనం. వాళ్లు నన్ను ఏవిధంగా అయితే ప్రేమిస్తున్నారో అదేవిధంగా నేను వారిని అభిమానిస్తున్నా. ఈ వివాదం విషయంలో చింతించడం లేదు. నా మనసులో ఎలాంటి చెడు ఉద్దేశం లేనప్పుడు ఎందుకు బాధపడతా. కొంతమంది మా స్వచ్ఛమైన ప్రేమను తప్పుగా చూస్తున్నారు. అలా చూసేవారి విషయంలో బాధపడుతున్నా. నిజం చెప్పాలంటే వారి వల్లే మరింత ఫేమస్ అయ్యా. అందుకు థాంక్యూ'' అని అన్నారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ అంటే తనకెంతో ఇష్టమని.. ఆమె మాదిరిగానే తాను కూడా భారతరత్న పురస్కారాన్ని అందుకోవాలనుకుంటున్నానని తెలిపారు. ఇతరుల సక్సెస్ చూసి ఏడ్చేవారి గురించి ఏమాత్రం పట్టించుకోనని అన్నారు. ఉదిత్ నారాయణ్ కొన్నిరోజుల క్రితం లైవ్ కాన్సర్ట్ నిర్వహించారు. తన కెరీర్‌లోనే పేరు పొందిన పాటలను ఇందులో ఆలపించారు. 'మోహ్రా'లోని టిప్ టిప్ బర్‌సా పాట పాడుతున్న సమయంలో కొంతమంది మహిళా అభిమానులు ఆయనతో ఫొటో తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. ఈక్రమంలోనే ఒక మహిళా అభిమాని పెదవులపై ముద్దు పెట్టుకోవడం అంతటా వైరల్ అయింది. 'అందమైన ప్రేమరాణి', 'అందాల ఆడబొమ్మ', 'కీరవాణి రాగంలో', 'పసిఫిక్‌లో దూకేయ్‌మంటే', 'అమ్మాయే సన్నగా'.. వంటి మధురమైన పాటలతో ఆయన తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన విషయం తెలిసిందే.



# రామ్‌చరణ్ చిత్రం... ఫిల్మ్ కెమెరాతో చిత్రీకరణ!

పాత రోజుల్లో సినిమా చిత్రీకరణ కోసం ఫిల్మ్ రీల్‌ని వాడేవారు. అందుకోసం నిర్మాతలకు బాగా ఖర్చయ్యేది. ఫిల్మ్ వృథా కాకూడదని నటీనటులు, దర్శకులు పలు జాగ్రత్తలు తీసుకుంటూ సింగిల్ టేక్‌లో సన్నివేశాల్ని పూర్తి చేసేందుకు ప్రయత్నించేవాళ్లు. డిజిటల్ హవా మొదలయ్యాక ఫిల్మ్ కనుమరుగైంది. ఇప్పుడు అధునాతన డిజిటల్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. చిత్రీకరణ కోసం అందరూ వాటినే వాడుతున్నారు. అయితే రామ్‌చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం కోసం అప్పటి రీల్ కెమెరాని వినియోగిస్తున్నట్టు ఛాయాగ్రాహకుడు రత్నవేలు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాలోని ప్రత్యేకమైన ఓ ఘట్టం కోసం పాత రోజులనాటి కొడక్ ఫిల్మ్ కెమెరాలో చిత్రీకరణ చేసి, ఆ తర్వాత దాన్ని డిజిటల్‌లోకి మార్చనున్నారు. పీరియాడిక్ కథతో రూపొందుతున్న చిత్రమిది. నాటి కాలంలో ఉన్నామనే అనుభూతిని పంచడం కోసమే ఈ ప్రయత్నమని తెలుస్తోంది. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

# ఊర్వశీ రౌతేలా తీరును తప్పుపట్టిన ప్రజ్ఞా జైస్వాల్

సైఫ్ అలీఖాన్ పై దాడి విషయంలో నటి ఊర్వశీ రౌతేలా మాట్లాడిన తీరును నటి ప్రజ్ఞా జైస్వాల్ తప్పుపట్టారు. విషయం ఏదైనా బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని తాజాగా ఇంటర్వ్యూలో చెప్పారు. ''అద్భుతమైన చిత్రాల్లో భాగమై.. గొప్ప నటీనటులతో కలిసి వర్క్ చేస్తున్నప్పుడు గౌరవంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. విషయం ఏదైనా బాధ్యతాయుతంగా మాట్లాడాలి. కామెంట్ చేసేముందు జాగ్రత్తగా ఉండాలి. ఇతర నటీనటుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి. మరీ అంత కఠినంగా ఉండకూడదు. ఏది ఏమైనా ఆమె క్షమాపణలు కూడా చెప్పడం మంచిదైంది'' అని ప్రజ్ఞా తెలిపారు. గత నెలలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. 'డాకు మహారాజ్' సక్సెస్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఊర్వశీరౌతేలాకు ఈ దాడి గురించి ప్రశ్న ఎదురైంది. తమ సినిమా సక్సెస్ కావడంతో తనకు ఎంతోమంది బహుమతులు పంపించారని ఊర్వశీ చెబుతూ.. తన బహుమతులను దాడికి ముడిపెట్టి మాట్లాడడంతో విమర్శలు ఎదుర్కొన్నారు.''సైఫ్‌పై దాడి దురదృష్టకరం. నేను నటించిన డాకు మహారాజ్ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. నాకు మా అమ్మ వజ్రపు ఉంగరం గిఫ్ట్‌గా ఇచ్చింది. మా నాన్న రోలెక్స్ వాచ్ ఇచ్చారు. కానీ, వీటిని ధరించి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఎవరైనా మనపై అలా దాడి చేస్తారనే భయం ఉంటుంది'' అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ట్రోల్స్ రావడంతో ఆమె క్షమాపణలు కూడా చెప్పారు. సైఫ్‌కు క్షమాపణలు చెబుతూ పోస్ట్ పెట్టి కొన్ని గంటల్లోనే డిలీట్ చేయడం గమనార్హం.

# ప్రోటీన్ రారాజులు.. వీటి ముందు చికెన్ కూడా దిగదుడుపే

ప్రోటీన్ అనేది మన శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. చాలా మంది ప్రోటీన్ కోసం చికెన్‌ను తింటారు. అయితే చికెన్ కంటే ఎక్కువ ప్రోటీన్ కలిగిన అనేక ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి. చికెన్‌కు అద్భుతమైన ప్రత్యామ్నాయాలు మాత్రమే కాకుండా.. రుచికరమైనవి, పోషకమైన ప్రోటీన్ ఫుడ్ గురించి తెలుసుకుందాం.

- రాజ్మా భారతీయ వంటకాలలో ముఖ్యంగా రాజ్మా చావల్ వంటి వంటలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. 100 గ్రాముల రాజ్మాలో 35 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. రాజ్మా చికెన్‌కు గొప్ప శాఖాహార ప్రత్యామ్నాయం. అవి ఫైబర్‌తో కూడా సమృద్ధిగా ఉంటాయి. దీనివల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది.
- శనగ పప్పును భారతీయ వంటకాలలో తరచుగా ఉపయోగిస్తారు. 100 గ్రాముల శనగ పప్పుతో చేసిన వంటకాల్లో 38 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు, గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. శనగ పప్పును పప్పు ఫ్రై వంటి వంటకాలలో లేదా చనా దాల్ నమ్‌కీన్ వంటి స్నాక్స్‌లో ఉపయోగిస్తారు.
- 100 గ్రాముల సోయాబీన్స్‌లో 36 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. సోయాబీన్స్‌లో మొత్తం తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా అవసరం. సోయాబీన్స్‌ను కాల్చి లేదా ఉడకబెట్టి తినవచ్చు. వివిధ రకాల వంటకాలలో కూడా ఉపయోగించవచ్చు.
- చిన్నవిగా కనిపించే ఈ గింజలు పోషకాలతో నిండి ఉంటాయి. 100 గ్రాముల గుమ్మడికాయ గింజలలో 37 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అంతేకాకుండా వీటిలో మెగ్నీషియం, జింక్, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా పుష్కలంగా ఉంటాయి. గుమ్మడికాయ గింజలను స్నాక్‌గా తినవచ్చు. సలాడ్‌లపై చల్లుకోవచ్చు లేదా స్మూతీస్‌లో కలుపుకోవచ్చు.
- పర్మేసన్ చీజ్ పాస్తాకు మంచి రుచిని ఇస్తుంది. 100 గ్రాముల పర్మేసన్ చీజ్‌లో 35 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది కాల్షియంలో కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలకు చాలా మంచిది. అయితే ఇందులో సోడియం ఎక్కువగా ఉంటుంది. మీ ఫుడ్ డైట్ లో ఈ ప్రోటీన్ రిచ్ ఫుడ్స్ ను చేర్చండి. దీని ద్వారా మీరు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.
- పనీర్ అనేది పాలతో తయారు చేయబడే ఒక పదార్థం. ఇది ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలం. 100 గ్రాముల పనీర్‌లో 40 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. పనీర్‌ను కూరలలో ఉపయోగించవచ్చు. టిక్కాలుగా కాల్చవచ్చు లేదా సలాడ్‌ల మీద కూడా ముక్కలు చేసి వేసుకోవచ్చు. పనీర్ ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం.



రిపోర్టర్లు కావలెను
V3 NEWS
"విశ్వంభర" తెలుగు దిన పత్రిక
VISHVAMBHARA TV
ప్రముఖ టీవీ ఛానల్స్, తెలుగు దినపత్రికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, కెమెరామెన్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com